గెడా రంగారావు

ఆకాశ పుత్రులు

రాజా

రాత్రి పదిగంటలు.

సైంటిస్ట్ పృథ్వీరాజ్ లాబరేటరీ ముందాగిన ఫియట్ కారులోంచి హుందాగా క్రిందకి దిగాడు మేజర్ సురేష్ గోయల్.

డోర్ లాక్ చేసి 'కీ' జేబులో వేసుకొని లైట్లకాంతిలో వెలుగుతోన్న లాబ్ బిల్డింగ్ లోకి నడిచాడు.

సింహద్వారానికి ఒక ప్రక్కగా కాలింగ్ బజర్ స్విచ్ బిగించబడి ఉంది. నొక్కాడు దానిని. లోపలెక్కడో బజర్ మ్రోగిన శబ్దం విన్పించింది. తలుపువైపు చూస్తూ నిలబడ్డాడు.

అరనిముషం తర్వాత తలుపులు తెరుచుకొన్నాయి.

బైటకొచ్చిన వ్యక్తిని పరీక్షగా చూసాడు సురేష్. సన్నగా పొట్టిగా ఉన్నాడతను. తెలివంతా కళ్ళలో ద్యోతక మౌతోంది.

"సైంటిస్ట్ పృథ్వీరాజ్ గారున్నారా అబ్బాయ్?" అడిగాడు తెల్లగా మెరుస్తోన్న మీసాల్ని ఎడమచేతితో నిమురుకొంటూ.

"ఉన్నారండీ!" చెప్పాడతను అణుకువగా.

జేబులోంచి విజిటింగ్ కార్డుతీసి అతని కిచ్చాడు.

"ఢిల్లీ నుంచి మేజర్ సురేష్ గోయల్ వచ్చారని చెప్పబ్బాయ్!" అన్నాడు హుందాగా.

"లోనికొచ్చి కూర్చోండి!" హుషారుగా లోనికి పరిగెత్తాడు అతను.

వెళ్ళి డబుల్ షీట్ సోఫాలో కూర్చొన్నాడు మేజర్ సురేష్. గదంతా చాలా అధునాతనంగా ఉంది.

ఊరికి చివరలో కట్టుకొన్న లాబరేటరీలో కూడా ఇంత అందమైన విశ్రాంతిగది కట్టుకొన్నందుకు మనసులోనే పృథ్వీరాజ్ ను అభినందించాడు సురేష్. గది గోడలకు అలంకరించబడిన అర్ధనగ్నపు సుందరీమణుల చిత్రాలు సైంటిస్ట్ రసికతను తెల్పుతున్నాయి.

పదినిముషాల తర్వాత ఆదరాబాదరా గదిలోకి పరిగెత్తుకొచ్చాడు పృథ్వీరాజ్. అతనివైపు చూసాడు సురేష్. సుమారు ముప్పై...ముప్పైఅయిదు మధ్య నుంటుంది వయస్సు. ఎరుపురంగులో ఎత్తుగా బలంగా ఉండిఅందంగా ఉన్నాడు.

"క్షమించాలి మిస్టర్ సురేష్...కొంచెం లేటయింది' ఎదురుగా మరో సోఫాలో కూలబడుతూ అన్నాడు పృథ్వీరాజ్.

"ఫరవాలేదులే అబ్బాయ్! నాకేం ఇబ్బంది కల్గలేదు" సిగార్ వెల్గించుకొంటూ అన్నాడు మేజర్ సురేష్.

సురేష్‌ను పరిశీలనగా చూసాడు పృధ్వీరాజ్.

సుమారు అరవై ఏళ్ళుంటాయ్ సురేష్‌కి. ఈ మధ్యనే ఆర్మీలోంచి రిటైరయ్యాడు. ఆరడుగుల మూడంగుళాల ఎత్తు, గోధుమరంగు శరీరం, ఒళ్ళంతా కండలు, విశాలమైన ముఖం ప్రాచీనకాలం నాటి రోమన్‌లా ఉంటాడు.

మిలటరీ మనిషని తెల్పుతూ గుబురుగా పెరిగిన తెల్లటి మీసాలు హుందాని కలిగిస్తోన్నాయి అతనికి. అరవై ఏళ్ళొచ్చినా చెక్కుచెదరని ఉక్కులాంటి వ్యక్తి సురేష్.

"నన్ను శ్రీహరికోట రాకెట్ సెంటర్ చీఫ్ విక్రాంత్ సిన్హా పంపాడు, నీతో శుక్రగ్రహ యాత్ర సాగించటానికి."

పృధ్వీరాజ్ కళ్ళు విచిత్రంగా మెరిసాయ్.

"గ్లాడ్ టు మీట్ యూ..." అన్నాడు సురేష్ చెయ్యి నొక్కుతూ.

"నేనూ విక్రాంత్ చిన్నతనంనుంచీ ఫ్రెండ్స్! నేను మిలటరీ దారి ఎన్నుకొంటే, వాడు స్పేస్ రూట్ పట్టాడు. నీ కోరిక ప్రకారం యాత్ర సాగించటానికి అనువైన మనిషి కోసం చూస్తే నేను గుర్తొచ్చి నాకు కబురు పంపాడు. పనీ పాటా లేక విసుగెత్తిపోతోన్న నాకు ఈ మాట వినగానే చెవుల్లో అమృతం పోసినట్లయి వెంటనే పరిగెత్తుకొచ్చాను."

చిరునవ్వు నవ్వాడు పృధ్వీరాజ్.

"చాలా థాంక్స్ మిస్టర్ సురేష్. కాని శుక్రగ్రహం వెళ్ళటం అంటే మాటలుకాదు. నేను వేసిన అంచనాలో

ఏ చిన్న తేడా వచ్చినా అంతరిక్షంలో మసయిపోతాం. ఒకవేళ క్షేమంగా శుక్రగ్రహానికి చేరుకొన్నా తిరిగి వస్తామనే నమ్మకం లేదు. అందుకే నాతో రావటానికి నా అసిస్టెంట్స్ తిరస్కరించారు.

పోతే నేనా, బ్రహ్మచారిని! నా గురించి పట్టించుకొనేవాళ్ళు గాని, విచారించేవాళ్ళుగాని ఎవరూ లేరు.

ఇక మీ సంగతి! మీ పై ఆశలు పెట్టుకొని ఎదురు చూసేవారు ఎందరో ఉండొచ్చు. తిరిగి క్షేమంగా వస్తామనే నమ్మకంతోగాని ఈ యాత్ర సాగించటానికి ఒప్పుకొంటే వెంటనే కాన్సిల్ చేసుకోమని నా ఎడ్వైజ్."

"నా విషయంలో చాలాపొరపాటు పడ్డావబ్బాయ్!" కళ్ళు మూసుకొని తృప్తిగా సిగార్ గుండెల్లోకంటా పీలుస్తూ అన్నాడు సురేష్. "నా భార్య గతించి పదేళ్ళయింది. నాకున్న ఒక్కగానొక్క కొడుకూ న్యూయార్క్‌లో ఇండియన్ ఎంబసీ ముఖ్యోద్యోగిగా పని చేస్తున్నాడు. అతని అనుమతిమీదే నేనీ యాత్రకు ఒప్పుకొన్నాను. ఈ విషయంలో నా కెలాంటి సందేహం లేదు."

"థాంక్యూ వెరీమచ్ సురేష్‌జీ! మీ మాటలు నాలో ఉత్సాహాన్ని ఇనుమడింప చేస్తున్నాయి. కమాన్ మన అంతరిక్ష నౌకను మీకు ఇంట్రడ్యూస్ చేస్తాను" హుషారుగా లేచాడు పృథ్వీరాజ్.

"ఆ విషయం తర్వాత చూడొచ్చబ్బాయ్! ముందీ సంగతి చెప్పు. ఇండియన్ స్పేస్ సెంటర్స్‌లో ఎంతో మంది సైంటిస్టు లుండగా, నీకు సహాయంగా రావటానికి వాళ్ళని కోరక ధైర్యవంతుడు, ఎలాంటి ప్రమాదాలనైనా

ఎదుర్కొనే సాహసవంతుడిని సైన్సు పరిజ్ఞానం లేకపోయినా ఫర్వాలేదని ఎందుకు కోరుకున్నావ్?" అడిగాడు సురేష్ సోఫాలోంచి లేస్తూ.

నవ్వాడు సైంటిస్ట్. "చూడండి సురేష్‌జీ! నా ఉద్దేశ్యంలో శుక్రగ్రహంలో జీవులున్నాయనేది నిజం. మనం అక్కడకు వెళ్ళింతర్వాత వాళ్ళనుంచి మనకు ప్రమాదం కలగవచ్చు. సైంటిస్టుగా నేను నా బాధ్యతలు నేరవేర్చగలను. పోతే నాకూ అక్కడ ప్రమాదాలనుంచి రక్షణ కావాలి. నాతో కలిసి మరో సైంటిస్ట్‌ను తీసుకెళితే ఫలితం ఏముంది. అందుకే అలాంటి లక్షణాలు కలిగిన వ్యక్తిని అడిగాను సహాయానికి. నా అదృష్టంకొద్దీ ఒక యుద్ధవీరుడు దొరికాడు" అన్నాడు తృప్తిగా. తర్వాత సురేష్‌ని తీసుకెళ్ళి అంతరిక్షనౌకను పూర్తిగా త్రిప్పి చూపించాడు.

అరగంటసేపు అంతా తిరిగిన తర్వాత–

"రేపు సాయంత్రానికల్లా ఇక్కడుంటా నబ్బాయ్! రాత్రి తొమ్మిదిన్నరక్కడా బైలుదేరేది!" అన్నాడు మేజర్ సురేష్.

"రాత్రికిక్కడే ఉండిపోకూడదూ?"

"సారీ నాకొక్కద్దిగా పనులున్నాయి. తొందరగానే వచ్చేస్తాను. గుడ్ నైట్!" బైటకు కదిలాడు. మరి కాస్సేపట్లో కారు స్టార్టయిన శబ్దం విన్పించింది.

పృథ్వీరాజ్ తలలో శుక్రగ్రహం మెదులుతోంది. నాలుగురోజుల్లో దాని సంగతికూడా తేలిపోతుందనుకొంటూ, అంతరిక్షనౌక దగ్గరకు తిరిగి నడిచాడు.

2

రాత్రి తొమ్మిది గంటలకు సైంటిస్ట్ పృధ్వీరాజ్ లాబ్ అంతా కోలాహలంగా ఉంది.

శాస్త్రజ్ఞులు, ప్రభుత్వోద్యోగులు అటూ ఇటూ తిరుగుతున్నారు. మేజర్ సురేష్, రాకెట్ సెంటర్ చీఫ్ విక్రాంత్ లోనికొచ్చారు. పృధ్వీరాజ్ తో కలిసి ఏదో కలిసి మాట్లాడుకొంటూ అంతరిక్షనౌక దగ్గరకు వెళ్ళారు. స్పేస్ షిప్ ను అన్నివిధాలా చెక్ చేసిన సైంటిస్ట్స్ తమ రిపోర్ట్ ను విక్రాంత్ కందించారు.

పరిశీలించి తృప్తిగా తలూపాడు విక్రాంత్. వాచీ చూసుకొన్నాడు పృధ్వీరాజ్. తొమ్మిదీ ఇరవై అయిదయింది.

"ఇక మేం బయలుదేరుతాం మిస్టర్ విక్రాంత్" అన్నాడు పృధ్వీరాజ్.

"ఓ. కె. మీరు విజయం సాధించి తిరిగి క్షేమంగా వస్తారని ఆశిస్తాను. కాని ఒకటిమాత్రం మర్చిపోవద్దు. శుక్రగ్రహంలో మొదటగా అడుగుపెడుతున్నది మనం. కాబట్టి ఈ విషయంలో వచ్చే కీర్తి మనకే దక్కుతుంది.

మీ ఊహప్రకారం అక్కడ నిజంగా జీవులుంటే వీలైతే మన ప్రభుత్వాన్ని వారు గుర్తించినట్లుగా ఒక పత్రాన్ని వారినించి తీసుకోండి. లేదా ఎలాగూ మన విజయాన్ని చాటుతూ మన జాతీయ పతాకాన్ని అక్కడుంచుతారుగా" నవ్వుతూ పల్కాడు విక్రాంత్ సిన్హా.

"ఇట్స్ ఆల్ రైట్...కమాన్ మిస్టర్ సురేష్!" స్పేస్ షిప్ లోనికి నడిచాడు సైంటిస్ట్. అతన్ని అనుసరించాడు మేజర్ సురేష్. నౌక తలుపులు మూసుకుపోయాయి.

అందరూ ఖార్ఖానాలోంచి బిల్డింగ్‌లోకి వెళ్ళి పోయారు. టెలివిజన్ ముందు కూర్చొని ఆన్ చేశాడు విక్రాంత్. బోర్లించిన తొట్టిలా స్పేస్ షిప్ కనిపిస్తోంది. స్క్రీన్ మీద. వాచీ చూసుకొన్నాడు. కౌంటింగ్ బిగిన్ కావటానికి ఇంకో నిముషం సమయముంది.

కాబిన్‌లోకి చేరుకొని తమ సీట్లలో కూర్చొన్నా రిద్దరూ. టెలివిజన్ స్క్రీన్‌పై ముందు గీతలు కన్పించి పావునిముషం తర్వాత ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ముఖం గంభీరంగా కన్పించింది.

"హల్లో సర్!" అన్నాడు పృధ్వీరాజ్. మేజర్ సురేష్ సిగార్‌ను కంగారుగా నోట్లోంచి బైటకు తీసాడు.

"మై డియర్ ఫ్రెండ్స్! మీ ఈ పరిశోధన విజయ వంతమై ఈ అంతరిక్ష యుగానికే మార్గదర్శక మాటమే కాక మన దేశానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు ఆర్జిస్తుందని ఆశిస్తాను. విష్ యు బెస్ట్ ఆఫ్ లక్" చిరునవ్వుతో అన్నా రాయన.

"థాంక్యూ సర్!" అన్నారిద్దరూ.

ప్రెసిడెంట్ ముఖం స్క్రీన్‌పై మాయమయింది. ఆ స్థానే విక్రాంత్ కన్పించసాగాడు.

కౌంటింగ్ ప్రారంభమయింది.

పృధ్వీ చకచకా మీటలు నొక్కాడు. స్పేస్ షిప్ అన్నివైపులా మూసుకుపోయింది. దాని చుట్టూ బిగించబడి వున్న క్రేన్స్ విడిపోయాయి.

"త్రీ...టూ...వన్...జీరో..." విక్రాంత్ అర్చాడు మైక్‌లో.

రియోస్టాట్ మీట పట్టుకొని బలంగాలాగాడు పృధ్వీ. భయంకరంగా ప్రేలింది నౌక అడుగుభాగం. క్రింద నించి

ఇంధనం అంటుకొని వేగంగా నేలపైకి దూసుకెళ్ళ సాగాయి జ్వాలలు. ఖార్ఖానా అంతా దద్దరిల్లిపోతోంది.

విపరీతమయిన శబ్దంతో "జూమ్" అంటూ రోదసీ నౌక పైకి లేవటం ప్రారంభించింది. ప్రేలుళ్ళు తగ్గాయి.

పృథ్వీరాజ్ చకచకా స్విచ్‌లన్నీ వేసాడు.

అంతరిక్ష నౌక వేగాన్ని పుంజుకొంది. స్పీడా మీట ర్‌లో ముల్లు సెకనుకు అయిదువందల కిలోమీటర్లు చూపు తోంది. భూభ్రమణానికి ఎదురుదిశగా స్పర్శ రేఖలో ప్రయాణిస్తోంది నౌక. కేంద్ర ప్రసారిత శక్తి నౌకను తూర్పుగా లాగుతోంది.

సురేష్ సిగార్ తీసి వెల్గించుకొంటూ అద్దాలలోంచి బైటకు చూసాడు. ఎటు చూసినా శూన్యం...అంతు లేని శూన్యం...ఆ శూన్యంలో ఎన్నో గ్రహాలు కన్పిస్తూ ఉక్కిరి బిక్కిరి కల్గిస్తున్నాయి.

అతని దృష్టి క్రిందకి మరలింది. నీలి కాంతితో నారింజ రంగు వెదజల్లుతూ భూమి సాక్షాత్కరించింది. ఖండాలు సముద్రాలు కలిసిపోయి ఒకేలా కన్పిస్తున్నాయ్.

గంటలు గడుస్తున్నాయ్. వేగంగా ప్రయాణం చేస్తోంది నౌక.

రాను రాను భూమి చిన్నదయిపోతోంది. దగ్గరలో ఏదో గ్రహం కన్పిస్తూ అంతరక్ష నౌక దానివైపు ప్రయాణి స్తోంది.

"మూన్!" అరిచాడు సైంటిస్ట్ నౌక కక్ష్యను మారుస్తూ. చంద్రుని ఆకర్షణ శక్తి నౌకను స్వల్పంగా లాగుతోంది.

పావుగంట తర్వాత చంద్రకక్ష్యలో నాలుగు ప్రదక్షి

ణాలు పూర్తిచేసి నౌక శుక్ర గ్రహం వైపు ఉరికింది. సురేష్ వైపు చూసాడు పృధ్వీరాజ్. సిగార్ పీలుస్తూ అంతరిక్షంలోకిచూస్తున్నాడు తన్మయత్వంగా.

"అబ్బాయ్!" పిల్చాడు సురేష్.

"ఏమిటి?"

"అదేకదూ శుక్రగ్రహం?" దూరంగా అస్పష్టంగా కన్పిస్తోన్న ఒక గ్రహం వైపు వేలుచూపిస్తూ అడిగాడు.

"అవును!"

"ఎంత దూరం ఉంటుందిక్కడికి?"

లెక్కలు కట్టాడు పృధ్వీరాజ్.

"సుమారు రెండున్నర కోట్ల మైళ్ళు!"

"ఎన్నాళ్ళు పడుతుందంటావ్ చేరుకోటానికి?"

"ఈ వేగంతో వెళ్తే నలభై గంటలు చాలు!"

ఆశ్చర్యంగా చూశాడు సురేష్.

పృధ్వీరాజ్ అంతా ఒకసారి చెక్ చేసి తృప్తిగా నిట్టూరుస్తూ ఫుడ్ టాబ్స్ నోట్లోకి వేసుకొని చైర్‌లో వెనక్కి వాలి కళ్ళు మూసుకొన్నాడు. బాగా అలసిపోయిన అతని శరీరం నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోయింది.

3

సురేష్ గట్టిగా కుదుపుతోంటే తృళ్ళిపడి లేచాడు.

"ప్రమాదం ముంచుకొస్తోం దబ్బాయ్..." అర్చాడు సురేష్. పృధ్వీ టేబిల్ పైకివాలి టెలిస్కోప్ ముందుకు నెట్టాడు ముఖాన్ని.

"మైగాడ్...ఉల్కాపాతం..." ఇంజన్ బోర్డు పైకి విజృంభించి చకచకా స్విచ్‌లు కదుపుతూ నౌక కక్షలను మారుస్తున్నాడు.

శుక్రుడి వైపు దూసుకుపోతున్న అంతరిక్ష నౌక ప్రక్కకు తిరిగింది. భయంకరమైన ఉల్కాపాతం శూన్యంలోకి ప్రయాణిస్తూ నౌకవైపు దూసుకొస్తోంది. అందులోని అతిస్వల్పమైన ఉల్కచాలు నౌకను భస్మీపటలం చేయటానికి.

మహోజ్వల వేగంతో ప్రయాణిస్తూ అంతరిక్షంలో నెబ్యులాగా మండిపోతోంది. అక్షికటకానికి కన్ను అప్పగించి నౌకను నడుపుతున్నాడు పృథ్వీ.

కాలం గడుస్తోంది. నౌకకు అతిసమీపంలోకి చేరుకొంటోంది ఉల్కాపాతం. సైంటిస్ట్ వేళ్ళు స్విచ్‌లపై కదులుతున్నాయి మెరుపులా.

పెద్ద కుదుపులతో దేన్నో గుద్దుకొన్నట్లు ఆగిపోయింది, అంతరిక్ష నౌక శూన్యంలో. విసురుగా వెళ్ళి ఇంజన్ బోర్డును గుద్దుకొంది సురేష్ తల. నోట్లో చుట్ట క్రిందకి రాలిపోయింది.

అరసెకను కాలంలో ఉల్కాపాతం ప్రక్కనుంచి దూసుకుపోయింది మరో దిశగా. స్పేస్ షిప్ ఆ వేగానికి దడదడ లాడిపోయింది. ఆ రాపిడికి నౌక బయటి భాగం విపరీతంగా వేడెక్కిపోయింది.

చూస్తుండగానే ఉల్కాపాతం కనుమరుగయిపోయింది. పృథ్వీ వ్రేళ్ళు రియోస్టాట్‌లను నొక్కగానే తిరిగి ముందుకు కదిలింది నౌక.

"థాంక్... గాడ్!" గట్టిగా నిట్టూరుస్తూ సైంటిస్టువైపు మెచ్చుకోలుగా చూసాడు.

"అవును ఇలాంటి ప్రమాదాలు ముందుముందు ఇంకా ఎదురవ్వవచ్చు."

దగ్గరలో శుక్రగ్రహం మనోహరంగా కన్పిస్తోంది.

"మరో పది గంటల్లో చేరుకోవచ్చు!" చెప్పాడు పృథ్వీ వాచీచూసుకొంటూ.

శుక్రగ్రహం చుట్టూ అలుముకొన్న దట్టమైన మేఘాలలోంచి సూర్యకాంతి పరావర్తనం చెంది కాంతివంతంగా కన్పిస్తోంది. ఆ మేఘాలు భూమండలంపై నీటిఆవిరి చిన్న స్ఫటికాలు ధూళితో నిండిన మేఘాల వంటివికావు. ఖగోళ శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం శుక్రమేఘాల్లో ధూళి, మంచు స్ఫటికాలు, కార్బనం, ఫార్మాల్డిహైడ్ అనే విషపదార్థం ఉంటాయి.

అటువంటి మేఘాలు శుక్రుని కప్పి ఉంచటం వలన శుక్రతలాన్ని ఖచ్చితంగా పరీక్షించటానికి శాస్త్రజ్ఞులకు సాధ్యపడలేదు.

శుక్రగ్రహం గురించి తనకు తెలిసిన విషయాలను మననం చేసుకొంటున్నాడు మేజర్ సురేష్.

సమయం గడుస్తోంది. రానురాను శుక్రుడు మరింత స్పష్టంగా కన్పిస్తూ పెద్దదౌతున్నాడు.

ఆరుగంటల తర్వాత శుక్రుడి సమీపానికి చేరగానే ట్రెజక్టరీ సవరణ చేసి కక్ష్యలో ప్రవేశపెట్టాడు నౌకను. ఇరవై నిముషాలనంతరం ఆగు ప్రదక్షిణలు పూర్తి చేసి శుక్రోపరితలం వైపుగా మేఘాలలోనికి ఉరికింది.

మెషిన్స్ పని చేయటం ఆగి ఇంధనం అంటుకొంది. ఎదురు రాకెట్స్ సహాయంతో వేగాన్ని క్రమంగా తగ్గించాడు పృథ్వీరాజు.

దట్టమయిన మేఘాలలోంచి ప్రయాణం చేస్తుండటం వలన ముందేమీ కన్పించటంలేదు. ఎదురుగా ఉన్న

స్క్రీన్స్‌పై కదులుతోన్న రేఖలు బట్టి లెక్కలు వేస్తున్నాడు సైంటిస్ట్.

టెలిస్కోప్ లోంచి శుక్రోపరితలం మసగ్గా కన్పిస్తోంది సురేష్‌కు. గైరోస్కోప్‌ల సహాయంతో అంతరిక్ష నౌకను చుట్టూ త్రిప్పి వెనుక భాగం మొదట దిగేటట్లు చేసాడు.

అతి నెమ్మదిగా ప్రయాణిస్తూ శుక్రతలంపై దిగటానికి సన్నద్ధమౌతోంది నౌక.

పృధ్వీరాజ్ స్విచ్ నొక్కగానే రోదసీ నౌక అడుగు భాగం నుంచి మూడుగొట్టాలు బయటకు చొచ్చుకు వచ్చి స్టాండులా తయారయింది.

సురేష్‌కి సైగ జేస్తూ చైర్ హాండిల్ చుట్టూ వ్రేళ్ళు బిగించాడు.

అరనిముషం తర్వాత ప్రచండమయిన శబ్దంతో శుక్రోపరితలాన్ని తాకింది రోదసీ నౌక.

4

కిటికీ అద్దాలలోంచి చుట్టూ వకసారి పరిశీలనగా చూశాడు సురేష్.

ఎటు చూసినా ఇసుక పొరలతో ఎడారిలా కన్పిస్తోందా ప్రాంతమంతా. ఎక్కడ బడితే అక్కడ బ్రహ్మజెముడు మొక్కల్లాంటి పొదలుదట్టంగా కన్పిస్తున్నాయి.

ఐదు నిముషాలు ఆలోచిస్తూ ఉండిపోయాడు పృధ్వీరాజ్. క్రమంగా అతని నుదిటిపై బడిన ముడులన్నీ విడిపోయాయి.

వాచీ చూసుకొన్నాడు. గంట పదయింది.

శుక్రగ్రహంపై సూర్యోదయం అయింది కాబోలు పరిసరాలలో వెలుతురు పర్చుకొంటోంది.

"కమాన్ మిస్టర్ సురేష్!" కుర్చీలోంచి లేస్తూ అన్నాడు. కనుబొమ్మలు పైకెత్తి పృధ్వీరాజ్ వైపు చూసాడు సురేష్.

"క్రిందకి దిగుదామా అబ్బాయ్?" అడిగాడు.

"అవును!"

"మరి ఆక్సిజన్?" సిలిండర్ అందుకొంటూ అడిగాడు. నవ్వాడు పృధ్వీరాజ్.

"కిటికీలోంచి పొదలు కన్పిస్తున్నాయా?"

"అవును! కన్పిస్తున్నాయి."

"మరయితే ఆక్సిజన్ సిలిండర్లెందుకు?"

అర్థమయింది సురేష్‌కి. జేబులోని రివాల్వర్‌ను ఒకసారి తడుముకొని కుర్చీలోంచి లేస్తూ అన్నాడు–

"నీది చాలా బ్రిలియంట్ బ్రెయిన్ అబ్బాయ్! ఆ ఆలోచనే నాకు రాలేదసలు!"

సమాధానం చెప్పకుండా కాబిన్‌లోంచి నడిచాడు సైంటిస్ట్. ఆగి సిగార్ వెలిగించుకొని అతన్ని అనుసరించాడు సురేష్.

మెషిన్‌రూంలోంచి డోర్ దగ్గరకు చేరుకొని స్విచ్ నొక్కాడు పృధ్వీరాజ్. నెమ్మదిగా తెరుచుకొంది డోర్. ఒక్కసారిగా నులివెచ్చని గాలి ఇద్దరి శరీరాన్ని తాకింది.

పృధ్వీ ముఖం వికసించింది. డోర్ ప్రక్కన బిగించబడిన త్రాళ్ళనిచ్చెనను బైటకు జారవిడిచి నెమ్మదిగా దిగసాగాడు సురేష్. అతని చేతిలోని రివాల్వర్ ట్రిగ్గర్ నొక్కితే బులెట్‌ను విడవటానికి సిద్ధంగా ఉంది. అతని వెనుకనే దిగుతున్న పృధ్వీరాజ్ నలుప్రక్కలా జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు.

నిచ్చెనను వదిలి నెమ్మదిగా కుడిపాదాన్ని శుక్రోపరితలంపై ఆన్చాడు సురేష్. ఇసుకపై తేలికగా ఆనిందతని పాదం. రెండవకాలును కూడా ఆన్చి నిచ్చెనను వదిలి నాలుగైదు అడుగులు వేసాడు. అతని ముఖంలో ఆశ్చర్యం కదులాడింది.

సాధారణంగా ఇసుకలో అంతదూరం నడిస్తే ఖచ్చితంగా కాళ్ళు కూరుకుపోతాయి. కాని ఇక్కడ ఎంత బరువుగా అడుగులు వేస్తున్నా ఇసుకపై తేలికగా పడుతున్నాయ్.

కొద్దిగా ఇసుక తీసుకొని అరచేతిలో వేసుకొని పరీక్షగా చూసాడు పృధ్వీరాజ్. తళతళా మెరుస్తూ జరజర లాడుతోంది ఇసుక. జేబులోంచి చిన్న ఖాళీ సీసా తీసుకొని ఆ ఇసుకను దానిలో వేసి మూతి బిగించి డోర్ గుండా లోనికి విసిరాడు.

పృధ్వీరాజ్ వైపు చూసాడు సురేష్.

ఆ ప్రక్కనే ఉన్న ఒక పొదవైపు నడిచాడు పృధ్వీ. నాలుగైదు అడుగుల ఎత్తుండి గుబురుగా ఉన్నాయి పొదలు. చేయి చాచి గరుగ్గా ఉన్న ఒక ఆకును తెంచబోయాడు.

మరుక్షణం బుస్‌మంటూ శబ్దం అయింది. చూస్తుండగానే పొద కుచించుకుపోయి బూడిదయిపోయింది విచిత్రంగా.

ఆశ్చర్యంతో తల విదిలించాడు సురేష్. పృధ్వీరాజ్ నొసలు ఆలోచనలతో ముడివడ్డాయి.

ఏదో అనబోతుండగా ఇద్దరిపై నుంచీ నీడ దూసుకెళ్ళింది.

చటుక్కున పైకి చూసాడు సురేష్. అతని చెయ్యి జేబులో దూరి రివాల్వర్ లాగింది. గోళంలాంటి ఆకారం మరోసారి ఇద్దరిపైనుంచీ గిరికీ కొట్టింది. ట్రిగ్గర్ నొక్కబోయాడు సురేష్.

చెయ్యి అడ్డుపెట్టి వారించాడు పృథ్వీరాజ్. అతని తీక్షణమయిన దృష్టి ఆ గోళంమీదే ఉంది.

ఆకాశంలో గిరికీలు కొడుతున్న గోళం నెమ్మదిగా క్రిందికి దిగసాగింది. ఊపిరి బిగబట్టి చూస్తున్నారిద్దరూ.

అకస్మాత్తుగా సురేష్ చెవులు ఏదో శబ్దాన్ని పసిగట్టాయి. ఆ గోళం దిగేకొద్దీ శబ్దం మరింత ఎక్కువై పూర్తిగా దిగేసరికి స్పష్టంగా విన్పించసాగింది.

"వాటె వండర్ ? ఏదో ఇంజన్ శబ్దంలా ఉంది కదూ?" అర్చాడు సురేష్.

పృథ్వీరాజ్ ఏదో ఆలోచిస్తుండగా గోళం తలుపు తెరుచుకొని బైట కొచ్చిందో ఆకారం. దానివైపు చూడగానే ఉలికిపడ్డారిద్దరూ.

ఏడడుగుల ఎత్తుందా శుక్రగ్రహజీవి. కాళ్ళు, చేతులు, తలా...ముమ్మూర్తులా మానవుడిని పోలి ఉంది.

పోతే ఒకటే తేడా. తలమాత్రం ముక్కోణాకారంలో ఉంది. చిన్న ముక్కు, ఆకు పచ్చరంగులో మెరుస్తోన్న కళ్ళు. చెవులు కన్పించటంలేదు. బూడిదరంగు శరీరం.

చేతులు పైకెత్తి, అటూ ఇటూ ఊపుతూ ఏదో అరిచాడు కఠోరంగా.

ఆశ్చర్యంగా చూస్తున్న ఇద్దరూ తేరుకొన్నారు. "ఏమిటా అరుపు?" కోపంగా చూశాడు సురేష్.

జేబులోంచి కర్చీఫ్ తీసి స్నేహపూర్వకంగా గాలిలో ఊపాడు పృధ్వీరాజ్.

కీచుమంటూ రెండడుగులు వెనక్కి వేసాడు శుక్ర గ్రహజీవి. సురేష్ అయోమయంగా చూస్తుండగా చటుక్కున గోళంలో దూరి తలుపు వేసుకొన్నాడు. మరుక్షణంలో ఆకాశంలోకి లేచి కనుమరుగయి పోయింది గోళం.

"పిచ్చి వెధవ...ఎందుకలా పారిపోయాడు?" పృధ్వీరాజ్ వైపు చూస్తూ అడిగాడు సురేష్.

పృధ్వీ జవాబియ్యలేదు. ఏదో ఆలోచిస్తున్నాడు. చీకట్లు ముసురుకొన్నాయ్ క్రమంగా.

చూస్తుండగానే ఆకాశంలో ఏదో గ్రహం మసగ్గా ప్రత్యక్షమయింది. ముదురు నారింజరంగులో మసకగా కన్పిస్తోన్న ఆ గ్రహంవైపు కుతూహలంగా చూస్తున్న సురేష్ ఎగిరి గంతేసాడు.

"వాట్ హేపెండ్?"

"భూమి..." అర్చాడు సురేష్.

"వాట్?"

"అవును...ఎర్తే, అదుగో చూడు" ఆకాశంలోకి చూపించాడు. తలెత్తి చూసి తలూపాడు పృధ్వీరాజ్.

మరో పదినిముషాల తర్వాత ఇద్దరూ చెరో రెండు ఫుడ్ టాబ్స్ మింగారు. చుట్టూ ఒకసారి చూసి క్రిందకి వ్రేలాడుతున్న నిచ్చెనవైపుకు కదిలాడు పృధ్వీరాజ్. అనుసరించాడు సురేష్.

5

ఉలిక్కిపడి కళ్ళు తెర్చారిద్దరూ ఒకేసారి.

బయటంతా వెలుగ్గా ఉంది. చెవులు చిల్లులు పడేంత ధ్వనులు విన్పిస్తున్నాయి. ఫ్రంట్ విండోస్ దగ్గరకు ఒక

గంతు వేసి బయటకు చూసాడు సురేష్.

అతని ముఖం ఆశ్చర్యంతో విప్పారింది. ఆకాశంలో కనుచూపు మేరంతా ఎగురుతూ కన్పిస్తున్నాయి గాలి పడవలు. చూస్తుండగానే నెమ్మదిగా క్రిందకి దిగసాగాయి. నాక చుట్టూ ఎడారంతా గాలి పడవలతో నిండిపోయింది.

"రా! అబ్బాయ్!" జేబులోని రివాల్వర్ అందుకొని డోర్ వైపు నడిచాడు సురేష్. ఇద్దరూ డోర్ తెర్చుకొని బయటకు వచ్చేసరికల్లా ఆ ప్రదేశమంతా గాలి పడవల లోంచి పైకి చూస్తున్న శుక్రగ్రహవాసుల హర్ష ధ్వానాలతో దద్దరిల్లిపోయింది.

అన్నింటికంటె కొంచెం పెద్దదిగా అందంగా ఉన్న వాయు నౌకలోంచి వారి నాయకుడు కొంచెం ముందుకు వచ్చి చేతులు రెండూ పైకెత్తి తలకొంచెం క్రిందకి వంచి అభివాదం చేసాడు.

చూస్తున్న పృధ్వీ సురేష్‌కి సైగ జేస్తూ తనూ అదే విధంగా అభివాదం చేసాడు. నాయకుడి ముఖంలో ఆనందం కదులాడింది. శుక్రగ్రహవాసులు మరోసారి హర్ష ధ్వానాలు చేసారు.

నాయకుడు నెమ్మదిగా వాయు నౌకలోంచి క్రిందకి దిగి స్పేస్‌షిప్ దగ్గరకు నడిచాడు.

ఆకాశంవైపు ఓసారి తనవాళ్ళ వైపు ఒకసారి చూసి స్పేస్‌షిప్ వైపు తిరిగి ప్రతిజ్ఞ చేస్తున్నట్లు అరనిముషం పాటు ఏదో మాట్లాడాడు. తర్వాత శిరస్సు వంచి వినయంగా నిలబడ్డాడు. మిగిలిన అందరూ అలాగే తలలు వంచారు.

పృధ్వీరాజ్ వైపు చూసాడు సురేష్ ఆసక్తిగా. చిన్నగా నవ్వాడు పృధ్వీరాజ్.

"బహుశా ఆతనితో కలిసి వాళ్ళ నగరానికి రమ్మని కాబోలు అతని ఉద్దేశ్యం!" సాలోచనగా అన్నాడు.

"అయితే ఇంకా ఆలస్యం ఎందుకు?" ఉత్సాహంగా అన్నాడు సురేష్. "వెంటనే వెళ్ళి నాలుగురోజులు సరదాగా గడిపేసి వాళ్ళ రాజుచేత మన ప్రభుత్వాన్ని గుర్తించినట్లు ఒప్పించి హాయిగా వెనక్కి వెళ్ళిపోదాం."

మరోసారి నవ్వాడు పృథ్వీరాజ్.

"బహుశా మీ రనుకొంటున్నంత తేలికగా ఈ పని జరగదనుకొంటున్నాను. అయినా వెళ్ళటం ఎలాగూ తప్పదుగదా. కమాన్." నెమ్మదిగా క్రిందకి దిగి వాయు నౌకలో ప్రవేశించాడు.

సురేష్ కూడా ఎక్కగానే ఉత్సాహంగా గాల్లోకి లేచి తూర్పుగా సాగిపోయాయి పడవలు. చుట్టూ ఉన్న రేలింగ్ కు ఆనుకొని శుక్రతలంపై కన్పిస్తున్న ప్రకృతి దృశ్యాలు పరికించటంలో మునిగిపోయాడు పృథ్వీరాజ్.

ప్రక్కనే నిలబడ్డ నాయకుడు, పృథ్వీవైపు చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

వాయు నౌక లోపల మెషిన్లు చేస్తున్న ధ్వని చెవులను గళ్ళిక్కిస్తూ వికారాన్ని కలిగిస్తోంది. నాయకుడి వాగుడు భరించలేక లోనికి వెళ్ళాడు సురేష్. గంటన్నరలో ఎడారిని దాటిపోయాయి వాయు నౌకలు.

ఎటు చూసినా ఎత్తైన పర్వతాలు, లోతైన లోయలు కన్పిస్తూ పరవశత్వాన్ని కలిగిస్తోన్నాయ్. నేలమీద విస్తృతంగా పెరిగిన రకరకాల చెట్లు గాలికి తలలూపుతూ అందంగా కన్పిస్తున్నాయి. అకస్మాత్తుగా నౌకలు పయనిస్తోన్న దారిలో ఎత్తైన పర్వతం ఎదురైంది.

నౌకలు వేగంగా ఆకాశంలోకి ఇంకా ఎత్తుకి లేచాయి. పర్వతాన్ని దాటుతుండగా సూర్యకాంతిలో ధగధగా బంగారంలా మెరుస్తున్న శిఖరాన్ని పరవశంగా చూశాడు.

పృధ్వీరాజ్ ముఖంలోకి చూస్తున్న శుక్రగ్రహవాసుల నాయకుడు 'షనారా' అన్నాడు నవ్వుతూ.

'సోనా' అన్నట్లు వినిపించింది.

"సోనా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"షనారా... షనారా." వేలుపెట్టి దూరమౌతున్న పర్వతాన్ని చూపించాడు నాయకుడు.

అంతలో విసురుగా లోనుంచి దూసుకొచ్చాడు సురేష్, ప్రశ్నార్ధకంగా చూశాడు పృధ్వీరాజ్.

"ఈ శుక్రగ్రహ వాసులంతా వాగుడు కాయల్లాగుంది, వీడి వాగుడు భరించలేక లోనికి వెళ్తే వీడి లాతోకడు తగి లాడు" విసుగ్గా అన్నాడు.

నాయకుడికి సురేష్ కోపం దేనికో అర్ధంకాలేదు. తెల్ల బోయి చూస్తున్న అతన్ని చూడగానే సురేష్‌కి నవ్వొచ్చింది.

సురేష్ తిరిగి నవ్వగానే నాయకుడి ముఖం వికసించింది. దగ్గరలోనే నగర పరిసరాలు ప్రారంభమయ్యాయి రానురానూ స్పష్టంగా కన్పిస్తోంది నగరం.

"సో అత్సేర" అన్నాడు నాయకుడు.

"సో అత్సేరా? అదేమిటబ్బాయ్?"

"బహుశా ఈ నగరం పేరేమో!"

నగరంలోనికి ప్రవేశించాయి వాయునౌకలు.

వింత వింత ఆకారాలలో ఉన్న ఎత్తైన భవంతులు కన్పిస్తున్నాయ్ ఎటు చూసినా. లక్షలాది శుక్రగ్రహ ప్రజలు తలలు పైకెత్తి ఆనందంగా అరుస్తున్నారు, మరి

కొన్ని వాయునౌకలలో శుక్రగ్రహ సైనికులు ఎదురొచ్చి వారిపై రకరకాల పువ్వులు జల్లుతున్నారు.

కొద్ది నిముషాలలో వాయునౌక నగరమధ్యలో ఉన్న ఎత్తైన రాజప్రసాదం ముందాగింది. మిగిలినవి మాత్రం ఆకాశంలోనే తిరుగాడసాగాయి.

భవనంపై నుంచి భేరీలు వెలువడ్డాయి. రాజప్రసాదం తలుపులు తెర్చుకొన్నాయ్. లోనుంచి శుక్రగ్రహ రాజు గంభీరంగా నడుచుకొంటూ వాయునౌక వద్దకు చేరుకొన్నాడు. అతన్ని చూడగానే రాజభవనం ముందు గుమిగూడిన వేలకొలదీ శుక్రగ్రహవాసులు వినయంగా తలలు వంచి మోకాళ్ళపై కూలబడ్డారు.

అతనివైపు పరిశీలనగా చూశాడు సురేష్. ఏడడుగుల ఎత్తున్న భారీ విగ్రహం. గుండెలవరకూ పెరిగిన తెల్లటి గడ్డంలో మీసాలుకూడా కలిసిపోయి పురాతన చైనా చక్రవర్తిలా ఉన్నాడు.

ముఖాన వృద్ధాప్య ఛాయలున్నా క్రూరత్వం స్పష్టంగా తెలుస్తోంది. పెద్ద గౌను పట్టావంటి అంగీ ఒళ్ళంతా కప్పుతోంది.

తనవైపు చూస్తున్న ఇద్దరివైపూ ఓసారి తేరిపార చూసి తలవంచాడు వినయంగా. అతని కంఠం ఆ పరిసరాలలో ప్రతిధ్వనించింది.

రెండునిముషాలు ఏకధాటిగా మాట్లాడిన అతని మాటల్లో 'సో అత్సేర, ఆకాశపుత్రా, అయిలీత' అన్న మాటలు తప్ప మిగిలినదేమీ అర్థంకాలేదు సురేష్‌కి.

భవనంపై మళ్ళీ భేరీలు మ్రోగాయ్. శుక్రగ్రహరాజు వెనక్కి తిరిగాడు. వాయునౌక తిరిగి గాలిలోకి లేచి దక్షిణంవైపుగా పరిగెత్తింది.

మౌనంగా పరిసరాలను చూస్తూ నిల్చున్నారిద్దరూ. ఆకాశంలోంచి చూస్తూంటే సో అత్నేర నగరం అద్భుతంగా కన్పిస్తోంది.

ఎత్తైన భవనాలమధ్య రహదారులు విశాలంగా ఉండి ఏవో వాహనాలు ప్రయాణిస్తోన్నాయ్. వాయునౌక నగరాన్ని వదిలి అరణ్యాలపై నుంచి ఎగురుతోంది. చూస్తోండగానే అవీ కనుమరుగయ్యాయి.

అరగంట తర్వాత అత్యంత సుందరమైన ఉద్యానవనంలో ఆగింది వాయునౌక. ఇద్దరూ దిగి దగ్గరలో కన్పిస్తున్న భవనంవైపు నాయకుడి వెంట నడిచారు.

"అయిలీత...అయిలీత..." అంటున్నాడు నాయకుడు. "నీ తలకాయ!" తిట్టుకొన్నాడు సురేష్ వాడేమంటున్నాడో అర్థంకాక.

భవనం దగ్గరకు చేరుకొన్నారు. భవనం ప్రక్కనే మరో రెండు వాయునౌకలు నిల్చి ఉన్నాయి. భవనంలోంచి ఓ అందమైన అమ్మాయి పరిగెత్తుకొంటూ నాయకుడి దగ్గరకు వచ్చింది.

"కోనా!" అన్నాడు నాయకుడు. ఇద్దరూ ఏదో మాట్లాడుకొన్నారు అరనిముషంపాటు. తరవాత నాయకుడు వెనక్కి తిరిగి ఇద్దరికీ వినయంగా తలవంచి సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

"ఆకాశపుత్రా!" పల్కింది కోనా.

నాయకుడివైపు చూస్తున్న ఇద్దరూ కోనావైపు తిరిగారు. వాళ్ళిద్దరూ తనవైపు తిరగగానే భవనంలోకి నడిచింది కోనా, ఆమె ననుసరించి వెళ్ళి విశాలమైన గదిలోకి చేరుకొన్నారు.

కోనా తిరిగి వెళ్ళిపోయింది. గది నలువైపులా కలియ చూశాడు సురేష్.

ఒకవైపు మంచాలు, దాని ప్రక్కనే పెద్ద టేబిల్‌పై పళ్ళాల నిండుగా ఏవో పదార్థాలూ కన్పిస్తున్నాయ్. టేబిల్ కిరువైపులా కుర్చీల్లాంటి ఆసనాలున్నాయ్.

"పదాబ్బాయ్! మంచి ఆకలిగా ఉంది" అంటూ టేబిల్ వైపు దూకాడు సురేష్. ప్లేట్లలో ఉన్న పదార్థాలు తినేసి గ్లాస్‌లో ఉన్న ద్రవం త్రాగగానే శుభ్రంగా కడుపునిండి నట్లనిపించింది ఇద్దరికీ.

ఒళ్ళంతా చాలా అలసటగా ఉండటంవలన మంచాలపై చేరగానే కళ్ళు మూతలుపడ్డాయి.

6

మేజర్ సురేష్‌కి మెలకువ వచ్చేసరికి బయటంతా చీకటిగా ఉంది. గదిగోడలనుంచి సన్నటి వెలుతురు ప్రసరిస్తోంది.

"గుడ్ మార్నింగ్!" అన్నాడు పృథ్వీ నవ్వుతూ.

మార్నింగ్ అంటూ లేచి నిలబడి అతను చూపించిన బాత్‌రూంలోకి నడిచాడు. పావుగంటలో కాలకృత్యాలు తీర్చుకొని బైట కొచ్చేసరికల్లా 'కోనా' తెచ్చిన బ్రేక్ ఫాస్ట్ టేబిల్‌పై రెడీగా ఉంది.

ఇద్దరూ చేరొక కుర్చీలో కూర్చొని బ్రేక్‌ఫాస్ట్ పూర్తి చేసి, కాఫీలాంటి ద్రవం త్రాగారు. సురేష్ గట్టిగా త్రేన్చి కర్చీఫ్‌తో మూతి తుడుచుకొంటుండగా కోనా గుమ్మంలో ప్రత్యక్షమైంది.

"ఆకాశపుత్రా" పిల్చింది. ఇద్దరూ తలలు త్రిప్పి చూశారు. తనవెంట రమ్మని సైగ జేసి బయటకు కదిలింది. నెమ్మదిగా అనుసరించారు ఇద్దరూ.

రెండునిముషాలలో భవనం పైకి చేరుకొని ఒక గది లోకి దారితీసింది కోనా. ఆమె ననుసరిస్తున్న ఇద్దరూ నెమ్మదిగా గదిలోకి కదిలారు.

గది నలువైపులా చూసిన సురేష్‌కి ఆశ్చర్యంతో కళ్లు తిరిగాయి. చాలా విశాలంగా అద్భుతంగా ఉండి వర్ణించ శక్యం కానంత అందంగా ఉందా గది.

గదిమధ్య సోఫాలో విశ్రాంతిగా కూర్చొని ఆలో చిస్తున్న 'అయిలీత' వాళ్ళని చూడగానే లేచి నిల్చొని వినయంగా ఆహ్వానించింది.

ఆమెవైపు చూసిన సైంటిస్ట్ పృథ్వీరాజ్ కి అడుగు ముందుకు పడలేదు. కళ్ళప్పగించి ఆమెవైపే చూస్తూండి పోయాడు.

కోనా, వాయునౌకల నాయకుడు మాటలబట్టి ఈ భవంతికి యజమానురాలు అయిలీత అని ఊహించాడు కాని, ఆ అయిలీత ఒక అప్సరస అని ఊహించుకోలేక పోయాడు.

ఈ శుక్రగ్రహవాసుల లోకంలో ఏవో కొద్ది పోలికలు తప్ప మనుష్యులా భూలోకవాసిని పోలియున్న అయి లీతను చూస్తుంటే మతిపోతోంది అతనికి.

ఐదున్నర అడుగుల ఎత్తుండి సన్నగా తీగలా ఉంది అయిలీత. పసుపుపచ్చ వర్ణానికి ఆకుపచ్చ వర్ణానికి మధ్య మిళితమైన వర్ణంలో తళతళా మెరుస్తోందామె దేహం.

పొడుగైన చేతులు, ఎత్తైన రొమ్ములు సన్నటి నడుం, విశాలమయిన భుజాలు, ఆమెకో ప్రత్యేకతను వింత ఆక ర్షణను కలిగిస్తోన్నాయ్. చిరుముక్కు, విశాలమయిన కళ్ళు, విల్లులా వంపుతిరిగిన పెదవులు, అయిలీతను అద్భు తమయిన అందగత్తెగా తీర్చి దిద్దాయి.

సురేష్ చెయ్యి భుజంపై పడగానే ముందుకి కదిలాడు. అయిలీత ప్రక్కగదిలోకి కదిలింది. ఆమె ననుసరిస్తూ మరో గదిలోకి వెళ్ళగానే మరోసారి ఆశ్చర్యపోయాడు, ఆ గదిలోని సైన్సు పరికరాలను చూసి.

కుర్చీల్లో కూర్చున్నారు ముగ్గురూ. కుర్చీకి అటూ ఇటూ ఉన్న రిసీవర్స్ వంటివి చెవులకు తగిలించుకోమని సైగ చేసింది అయిలీత, తనూ కూడా రిసీవర్స్ చెవులకు బిగిస్తూ.

ఆమెవైపే చూస్తూ ఇద్దరూ రిసీవర్స్ తగిలించుకొన్నారు.

సురేష్ సిగార్ లేసి వెల్గించుకొని గట్టిగా పొగ పీలుస్తూ కళ్ళు మూసుకొన్నాడు తన్మయత్వంగా.

పృథ్వీరాజ్ వైపే చూస్తున్న అయిలీత సన్నగా చిరునవ్వు నవ్వింది. మరోసారి మైమర్చిపోయాడు పృథ్వీ.

అయిలీత పెదవులు కదిలాయ్.

"మా ఆతిథ్యంలో ఏవైనా లోపాలుంటే క్షమించండి" రిసీవర్స్‌లోంచి స్పష్టంగా విన్పించాయా మాటలు చక్కటి ఇంగ్లీషులో.

తన్మయత్వంగా కళ్ళు మూసుకొని ఉన్న సురేష్ చటుక్కున కళ్ళు తెరిచాడు. అతని నోట్లోంచి చుట్ట జారి తొడపై బడింది. కంగారుగా అందుకొని తిరిగి నోట్లో పెట్టుకొన్నాడు.

పృథ్వీరాజ్ నొసలు ముడిచి అయిలీత వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"వాట్! మీకు ఇంగ్లీష్ వచ్చా?" అర్చాడు సురేష్. చిరునవ్వు నవ్వింది అయిలీత.

"రాదు!"

"మరయితే ఎలా మాట్లాడగల్గుతున్నారు?"

"నేను మీ భాషలో మాట్లాడటం లేదు మిస్టర్ సురేష్. మీ చెవులకున్న రిసీవర్స్ నా మాటలను ట్రాన్స్లేట్ చేసి మీ కందిస్తున్నాయ్."

మళ్ళీ నోరు తెర్చాడు సురేష్. అయితే ఈసారి సిగార్ చేతిలో ఉండటంవలన మళ్ళీ డామేజ్ జరగ లేదు.

"మిస్. మా గురించి మీకేం తెలుసో చెప్తారా?" ఈ సారి అడిగింది పృథ్వీరాజ్.

"ష్యూర్!" అంది అయిలీత. "అసలు మీ అంతరిక్షనౌక మా శుక్రగ్రహానికి బైలుదేరినప్పుడే మీ విషయం మా గ్రహంలో అందరకూ తెలిసిపోయింది. ఎలాగంటే మీ నౌక భూకక్ష్యను దాటగానే రేడియో అండ్ టెలివిజన్ ప్రసారాలకోసం అంతరిక్షంలో పరిభ్రమిస్తున్న అమెరికన్ ఉపగ్రహం ఒకటి ప్రపంచమంతా మీవార్త ప్రసారం చేసింది. ఆ సందర్భంలో అంతరిక్షంలో పరిభ్రమిస్తున్న ధ్వని తరంగాలను ఆకర్షించిన అత్యంత శక్తివంతమయిన మా రేడియో అండ్ టెలివిజన్ రిసీవర్ స్టేషన్లు మీ లోకవాసులతో పాటు ఆ వార్తను అందుకొని ట్రాన్స్లేట్ చేసి అసలు విషయాలను తెలుసుకొన్నాయి. ఆ సందర్భంలోనే టెలివిజన్స్ద్వారా మీ ఫోటోలు తీయబడ్డాయి."

"వండర్! సైన్సులో మాకంటే ఎంతో ప్రగతిని సాధించారన్నమాట!" అన్నాడు పృథ్వీరాజ్.

"లేదు మిస్టర్ రాజ్! సైన్సులో మేం క్రొత్తపుంతలు తొక్కినా కేవలం ఈ ట్రాన్స్లేషన్ మిషన్స్, పవర్ఫుల్ రేడియో స్టేషన్స్, ఎలక్ట్రానిక్ కార్స్, డామ్స్

లాంటి చిన్న చిన్న విషయాలలోనే పురోగమించాము. కాని మీ అంత అభివృద్ధిని సాధించలేకపోయాం.

మీరు ఎన్నో ఏళ్ళ క్రితం కనుగొన్న విమానాలను మేము, ఈనాడు వాయునౌకల రూపంలో తయారుచేసుకోగలిగాము. మీరు ఈనాడు విస్తృతంగా తయారుచేస్తున్న రాకెట్స్‌ను ఉపగ్రహాలను మేము నిర్మించుకోటానికి కొన్నివందల ఏళ్ళు పట్టొచ్చు.

అంతెందుకు యుద్ధాలొస్తే మా గ్రహవాసులకున్న ఆయుధాలు కేవలం నిప్పు బాణాలనుంచి మిషన్‌గన్నుల దాకా, తోపులనుంచి గ్రెనేడ్స్ దాకా మాత్రమే. మీరు యుద్ధాలలో ఉపయోగించే మిసైల్స్, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్స్ ఎప్పటికి తయారుచేసుకో గలమో ఊహాతీతం.

ఆఖరికి సాగర గర్భంలో ప్రయాణించటానికి కూడా సబ్ మెరైన్స్, బాతిస్కోప్‌లు లేవు మాకు" అయిలీత కంఠంలో విచారం సుళ్ళు తిరిగింది.

"ఐయాం వెరీ సారీ మిస్ అయిలీతా. అనవసరంగా మిమ్మల్ని బాధపెట్టాను." నొచ్చుకొన్నాడు పృధ్వీరాజ్.

చిన్నగా నవ్వింది అయిలీత. "ఇందులో అనవసరమనే ప్రసక్తే లేదు. అంతా అవసరమే!"

"దట్సాల్ రైట్!మాకీ ఆతిధ్యం ఇంకా ఎన్నాళ్ళుంటుందో చెప్పగలరా?"

సురేష్ సిగార్ పీలుస్తూ సంభాషణ వింటోన్నాడు.

"మా నాన్నగారినుంచి ఏ విషయం తెలిసేదాకా మీకీ ఆతిధ్యం తప్పదు! అయినా ఏం? అప్పుడే మా లోకం విసుగు కలిగిస్తోందా?" నవ్వింది అయిలీత సన్నగా.

"మీ నాన్నగారినుంచి వార్తా?" కొంచెం అనుమానంగా చూసాడు.

"అన్నట్లు మా నాన్నగారెవ్వరో మీకు చెప్పలేదు కదూ! సో అత్సేర నగరంలో మీరు కలుసుకొన్న చక్రవర్తే మా నాన్నగారు. ఇది వారి విశ్రాంతి భవనం. అప్పుడప్పుడొచ్చి ఓ నాలుగు రోజులుండి తిరిగి వెళ్తుంటారు. ప్రశాంతంగా ఉండి నా పరిశోధనల కనువుగా ఉంటోందని నే నిక్కడే ఉండిపోయాను" చెప్పింది.

"వాట్...మీరు యువరాణా? అయితే చూడమ్మాయ్...మీ నాన్నగారితో చెప్పి మా దేశాన్ని గుర్తించినట్లు కాస్త వప్పించి పెట్టమ్మా. హాయిగా ఇంటి కెళ్ళిపోతాం..." తక్కున అన్నాడు సురేష్.

నవ్వింది అయిలీత.

"తప్పకుండా అలాగే చేద్దాం సురేష్‌జీ!" అంది. కోనా నెమ్మదిగా గదిలోకి వచ్చింది.

లేచి నిలబడింది అయిలీత.

"మిగిలిన విషయాలు తర్వాత మాట్లాడుకోవచ్చుగాని ముందు సప్పర్ కానిద్దాం" అంటూ రిసీవర్స్ తీసి కుర్చీపై పడేసింది.

ఇద్దరూ కుర్చీలోంచి లేచి నిల్చున్నారు. కోనా వెనుకనే ముగ్గురూ బైటకు కదిలారు. గది దాటుతోంటే తిరిగి మూగవాళ్ళమై పోయినట్లనిపించి నవ్వొచ్చింది సురేష్‌కి.

పృధ్వీరాజ్ ముఖంలో ఏదో తెలియని ఘర్షణ కన్పిస్తోంది సుస్పష్టంగా.

7

వారం రోజులు గడిచాయ్. తిని కూర్చోవటం విసుగ్గా ఉన్నా అయిలీత పరిచయం పృధ్వీరాజ్‌లో క్రొత్త

ఉత్సాహాన్ని ఉత్తేజాన్ని కలిగిస్తోంది. ఈ వారంరోజుల్లో ఇద్దరికి శుక్రగ్రహవాసుల భాష చాలావరకు వచ్చేసింది.

సూర్యోదయంతోనే లేవటం, కోనా తీసుకొచ్చిన బ్రేక్ ఫాస్ట్ పూర్తిచేయటం, తర్వాత సప్పర్ టైందాకా అయిలీతతో వైజ్ఞానిక చర్చ, సప్పర్ తర్వాత కొద్దిసేపు నిద్ర, సాయంత్రం అయిలీతతో షికారు—ఇదీ పృధ్వీ రాజ్ దినచర్య.

సురేష్ దినచర్యకూడా ఇదే గాని సాయంత్రం షికారు టైంలో బైటకు రాకుండా ఇంట్లోనే ఉండిపోతాడు కోనాతో.

ఆరోజు మధ్యాహ్నం నిద్రపోయిన పృధ్వీరాజ్ కి తిరిగి మెలకువ వచ్చేసరికి గంట మూడయింది. కిటికీలోంచి నీరెండ లోనికి వస్తూ సాయంత్రం అయిపోతోందని హెచ్చరిస్తోంది. వేగంగా వెళ్ళి బాత్రూంలో దూరాడు.

సురేష్ అప్పటికే బయట కెళ్ళిపోయాడని ఖాళీగా ఉన్న ప్రక్క మంచం తెల్పుతోంది.

బేతింగ్ పూర్తిచేసి ట్రిమ్‌గా బైటకొచ్చేసరికి కోనా టేబిల్ పై ఏవో పదార్థాలు సర్దుతోంది. నిముషాలలో ప్లేట్లన్నీ ఖాళీ చేసేశాడు. కోనా నవ్వుతూ బైటకు నడిచింది.

"హలో డార్లింగ్!" అన్నాడు గుమ్మంలో ఎదురైన కోనాని పలకరిస్తూ గదిలో కొస్తోన్న సురేష్.

కళ్ళు చికిలించి పెదాలు ముడుస్తూ వెక్కిరించింది కోనా. "సిల్లీ గర్ల్" ముక్కు పట్టుకొని ఊపాడు.

సీమ్మిరపకాయలా ఉండే కోనాముక్కుని చూస్తోంటే సురేష్‌కి ఎక్కడలేని సరదా పుట్టుకొస్తుంటుంది. ఆ సర

దాలోనే ధ్వజస్తంభం లాంటి తన ముక్కును వేళ్ళతో నిమురుకోవటంకూడా అలవాటయిపోయిం దతనికి.

కోనా వెళ్ళిపోయింది. లోనికి నడిచి పృధ్వీరాజ్ ప్రక్కన కూలబడి టేబిల్‌పై నున్న గ్లాస్ అందుకొని కాఫీలాంటి ద్రవం తాగాడు.

పృధ్వీ గ్లాస్ టేబిల్‌పై పెట్టి లేవబోయాడు. సురేష్ ఠక్కున అతని చెయ్యి పట్టుకొన్నాడు.

"కూర్చో...నీతో కొంచెం మాట్లాడాలి," అన్నాడు గ్లాస్ ఖాళీచేస్తూ.

"రాత్రికి మాట్లాడుకోవచ్చు...అర్జంటా?"

"ఓ అయిదు నిముషాలలో లేటేమీ అయిపోదు కూర్చో" చెయ్యి బలంగా లాగాడు.

సురేష్ వైపు విచిత్రంగా చూస్తూ కూర్చొన్నాడు పృధ్వీరాజ్. ఖాళీ గ్లాస్ టేబిల్‌పై పడేసి సిగార్ వెలిగించాడు సురేష్.

"రాజ్! నువ్వు అయిలీతను ప్రేమిస్తున్నావ్ కదూ?" సూటిగా ముఖంలోకి చూస్తూ అడిగాడు.

ఓ క్షణం కలవరపడ్డాడు పృధ్వీరాజ్.

"అవును!" అన్నాడు చివరికి.

"మరి అయిలీత కూడా నిన్నే ప్రేమిస్తోందా?"

"తెలియదు!"

"అయితే ముందా విషయం తెల్సుకో!"

విస్మయంగా చూశాడు సురేష్ వైపు పృధ్వీరాజ్.

"కంగారుపడక!" నవ్వాడు సురేష్."అయిలీత కూడా నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తోంది."

"మీ కెలా తెలుసు?" ఆశ్చర్యంగా చూశాడు.

"నలభైఏళ్ళ అనుభవం చెప్తోంది." మళ్ళీ నవ్వాడు సురేష్.

"మరోవిషయం 'సో అత్సేర' నగరంలో వాతావరణం అంత బాగుండలేదని నా అనుమానం, ఏ క్షణాన్నైనా విప్లవం లేచి అంతర్యుద్ధం ప్రారంభమయ్యే సూచనలు కన్పిస్తున్నాయ్" గంభీరంగా అన్నాడు సురేష్.

తెల్లబోయాడు పృధ్వీరాజ్.

"ఏమిటి మీ రనేది... ఈ అనుమానం మీ కెలా వచ్చింది?" అయోమయంగా అడిగాడు.

కొంచెం తీక్షణంగా చూశాడు సురేష్.

"అబ్బాయ్! మరీ అయిలీత ప్రేమలో పడి మనస్సుతో పాటు బుర్రకూడా ఇచ్చేసి వెర్రివాడిలా తయారవ్వకు. కొంచెం బుద్ధి ఉపయోగిస్తే నీకే తెలుస్తుంది," లేచి బైట కెళ్ళిపోయాడు.

ఐదునిముషాలవరకూ సురేష్ మాటలనే మననం చేసుకొంటూ కూర్చొండిపోయిన పృధ్వీరాజ్, నెమ్మదిగా లేచి బైటకు నడిచాడు.

భవనం మెట్లపై నిలబడి ఆకాశంలోకి చూస్తున్న అయిలీతను చూడగానే అతని ఆలోచనలన్నీ పటాపంచలై పోయాయ్.

ఉత్సాహంగా అడుగులు వేస్తూ అయిలీతను చేరుకొన్నాడు. పృధ్వీరాజ్‌ను చూడగానే చిరునవ్వునవ్వింది అయిలీత. ఇద్దరూ కొంచెం దూరంలో ఉన్న నదీపాయల వైపు వెళ్లారు.

నది ఒడ్డున కూర్చొని నీళ్ళలో ప్రతిఫలించి మనోహరమయిన రంగులు వెదజల్లుతోన్న సూర్యకిరణాలను పరవశంగా చూడసాగాడు పృధ్వీరాజ్.

"అయిలీతా?" పిల్చాడు పృథ్వీరాజ్.

"ఊ..."

"నేనో మాట అడగనా?" అడిగాడు.

"అడగండి!"

"అయిలీత...నన్ను పెళ్ళిచేసుకొంటావా?"

ఠక్కున తలెత్తి చూసింది అయిలీత అతనివైపు. ఆకాశంలోకి చూస్తోన్న పృథ్వీరాజ్ తక్కువ కాంతిలో మనోహరంగా కన్పించాడామెకు.

మాట్లాడక పోవటంతో ఆమెవైపుకు తిరిగి మళ్ళీ అడిగాడు పృథ్వీరాజ్.

"వీలుపడదేమో...మరో గ్రహవాసిని వివాహమాడటానికి మా వాళ్ళొప్పుకోరు" తల ప్రక్కకు త్రిప్పుకొని ఒణుకుతున్న కంఠంతో అంది.

"ఆ విషయం నేను చూసుకొంటాను. నీ కిష్టమే కదా?" అడిగాడు.

సిగ్గుతో తలూపిందామె.

పృథ్వీరాజ్‌లో ఆనందం ఉరకలేసింది.

అయిలీతను హృదయానికి హత్తుకొని ఉద్రేకంతో ఒళ్ళంతా ముద్దులు కురిపించాడు.

8

నిద్రపట్టక మంచంమ్మీద ప్రక్కకి పొర్లాడు సురేష్. పరిస్థితులను ఆలోచించే కొద్దీ విసుగుపుడుతోందతనికి. అయిలీత ఆలస్యానికి కారణం అర్థంకావటంలేదు. అప్పుడే శుక్రగ్రహం చేరి నెల దాటుతోంది. తిని కూర్చోవటం తప్ప చేసే పని ఒక్కటీ కన్పించటంలేదు.

వాచీ చూసుకొన్నాడు సురేష్.

గంట రెండయింది. మంచం దిగాడు. ప్రక్క బెడ్ పై పృథ్వీరాజ్ పడుకొని నిద్రపోతున్నాడు.

బాత్ రూం కెళ్ళి ముఖం కడుక్కొని ఫ్లాస్క్ లోని ద్రవం తీసుకొని త్రాగాడు.

బద్ధకం తగ్గింది. గోడపైనున్న బటన్ నొక్కాడు. గోడల్లోంచి వెలువడుతున్న కాంతి ఎక్కువై గదంతా వెలుతురుతో నిండిపోయింది.

ఏం చెయ్యాలో తోచలేదు సురేష్ కి. గదిలో ఒక మూల రాక్ నిండుగా సైన్స్ బుక్స్ కన్పించాయ్. సైన్స్ అంటే సురేష్ కి చిరాకు.

నెమ్మదిగా టెలివిజన్ దగ్గరకు నడిచాడు. అంతరాత్రి వేళ ప్రోగ్రాములేమీ రావని తెలిసికూడా ఆన్ చేశాడు. గుమ్మంలో అలికిడైంది.

తల త్రిప్పి చూశాడు. కోనా గదిలో కొచ్చింది.

“హాయ్ డార్లింగ్ నిద్ర పట్టలేదా?” అడిగాడు సురేష్.

“లేదు! మీ గదిలో శబ్దం అవుతోంటే మెలకువ వచ్చింది” అంది సురేష్ కూర్చొన్న కుర్చీ కోడుపై కూర్చొంటూ. చెయ్యిపట్టుకొని విసురుగా లాగాడు మేజర్ ఎగిరి ఒళ్ళో పడింది.

“బ్రతికించావ్! నిద్రపట్టక ఒక్కణ్ణే చస్తున్నాను” కోనా ముక్కు గిల్లుతూ అన్నాడు.

టెలివిజన్ చిన్నగా శబ్దం చేస్తోంది. స్క్రీన్ పై గీతలు కదులుతున్నాయ్.

“కోనా! ఏ స్టేషనైనా వస్తోందేమో చూసి, ఏమీ రాకపోతే కట్టేయ్!” కుర్చీలో వాలుతూ అన్నాడు. కోనా ఒడిలోంచి క్రిందకి దూకింది.

సురేష్ పరిశీలనగా చూస్తున్నాడు టెలివిజన్ వైపు. శోనా వ్రేళ్ళు బటన్స్‌పై కదులుతున్నాయ్. వేగంగా కదులుతోన్న ఆమె వేలు జర్రున జారి ఒకమూలగా ఉన్న చిన్న బటన్‌ను ప్రెస్ చేసింది.

ఉలిక్కిపడుతూ మరో బటన్‌ను నొక్కబోయింది కంగారుగా.

సురేష్ ముఖంలో రంగులు మారాయ్. మెరుపులా కుర్చీలోంచి లేచి శోనా భుజం పట్టుకొని వెనక్కి లాగాడు.

శోనా ముఖం వాలిపోయింది.

సురేష్ నొసలు ముడివడ్డాయ్. కుర్చీ టెలివిజన్‌కు మరింత దగ్గరగా లాక్కొని ఆసక్తిగా చూడసాగాడు.

భయంతో చిన్నగా ఒణుకుతూ ప్రక్కనే నిలబడింది శోనా.

విశాలమయిన గదిలో ఎత్తైన సింహాసనంపై కూర్చున్నాడు శుక్రగ్రహ చక్రవర్తి. ఆయనకు రెండువైపులా ఉన్న వరుస ఆసనాలలో కూర్చొని ఉండి కన్పిస్తున్నారు శుక్రగ్రహవాసులు చాలామంది.

అంతకు చాలా ముందునుంచీ ఏదో తీవ్రమయిన వాదన జరుగుతున్నట్లు అందరి ముఖాలూ చాలా సీరియస్‌గా ఉన్నాయ్. మహారాజ్ పిడికిళ్లు కోపంతో బిగించి ఏ క్షణానైనా లేడిపై ఉరకబోయే చిరుతపులిలా చూస్తున్నాడు.

ఏదో సీక్రెట్ కాన్ఫరెన్స్ జరుగుతున్నట్లు అర్థమైంది సురేష్‌కి. మరో అనుమానంకూడా వచ్చిందతనికి. కావాలనే శోనా మధ్యలో కల్పించుకొని ఈ కాన్ఫరెన్స్ తనకు తెలిసేటట్లు చేసిందా?

కోనా ముఖంలోకి చూశాడు సూటిగా.

తలూంచుకొంది, ముఖం టెలివిజన్ వైపు త్రిప్పాడు. శుక్రగ్రహ చక్రవర్తికి ఎడమచేతివైపు వరుసలో కూర్చొన్న ఒక పొడుగైన శుక్రగ్రహ వాసి లేచి నిల్చున్నాడు:

"గూసెవ్! నేను చెప్పేది నెమ్మదిగా విను. అనవసరంగా పట్టుదలకు పోయి ఆకాశపుత్రులకు ఆపద తలపెట్టకు. నీ కూతురు వాలకం చూస్తోంటే వాళ్ళకు ఆపద తలపెట్టడం ఇష్టం లేనట్లు ప్రవర్తిస్తోంది.

నీ దురుద్దేశం ఆకాశ పుత్రులకు తెలియదు కాబట్టి మంచిగా, మర్యాదగా ఆకాశపుత్రుల నిద్దరినీ నగరానికి పిలిపించి, జరిగిన ఆలస్యానికి క్షమార్పణ చెప్పుకొని స్నేహం చేసుకో. వాళ్ళిద్దర్నీ చంపేస్తే నీ కొరిగే లాభం ఏమిటో నా కర్థం కావటంలేదు" నచ్చచెపుతున్నట్లు పలికాడు మృదువుగా.

బుసకొట్టాడు చక్రవర్తి గూసెవ్!

"కోనిగీ! స్నేహం పేరుతో ఈ ఆకాశ పుత్రులను వదిలేస్తే ఏం జరుగుతుందో తెల్సా?

"వాళ్ళు తిరిగి క్షేమంగా తమ లోకం చేరుకొన్న మరుక్షణం మహాదుర్మార్గులైన ఈ భూగ్రహవాసులు లక్షల సంఖ్యలో మనపైకి విరుచుకుపడతారు!" కోపంగా అరిచాడు గూసెవ్.

పొట్టిగా ఉన్న మరో శుక్రగ్రహవాసి విసురుగా లేచి నిలబడ్డాడు.

"కోనిగీ! ఈ ముసలినక్కగాడి మాటలు నమ్మకు. ఆకాశపుత్రులతో స్నేహం చేస్తే వాళ్ళ సహాయంతో

వాడికి ఎదురు తిరుగుతా మేమోననే భయంతో నాటక మాడుతున్నాడు. వాడి రాజరికం నిలుపుకోటానికి ఆ ఆకాశపుత్రులని చంపేద్దామని చూస్తున్నాడు'' ఆవేశంతో ఊగిపోతూ అన్నాడు.

''నోర్మూయ్యరా వుండాకోర్! అధికంగా వాగా వంటే కాల్చేస్తాను'' అరుస్తూ లేచాడు సింహాసనంలోంచి చక్రవర్తి గూసెవ్.

''ఎవడ్ని బెదిరిస్తావురా గూసెవ్? నేనేం నీ మోచేతి నీళ్ళు త్రాగే సైనికుడిని కాను. ఈ ఇంజనీర్ లోస్ శుక్ర గ్రహవాసుల ప్రియనాయకుడు అన్న విషయం మర్చిపోకు.

''ఒరేయ్ ముసలిగాడిదా! ఇన్నాళ్ళూ బుద్ధిలేక నీ రాజ రికానికి కట్టుబడ్డామురా! నీ పరిపాలనలో ఈ శుక్రగ్రహ వాసుల జీవితాలు ఎంత అధ్వాన్నంగా తయారయ్యాయో తెల్సా? మంచిగా ఇప్పుడయినా నువ్వు సింహాసనాన్ని విడిచిపెట్టరా. ప్రజల జీవితాలు బాగుపడతాయ్!'' కోపంగా గర్జించాడు ఇంజనీర్ లోశ్.

''ఏమిటిరా కూస్తున్నావ్... వెధవా? నిన్ను... నిన్ను...! రేయ్! ఎవర్రా అక్కడ?'' అరుస్తున్నాడు చక్రవర్తి గూసెవ్.

గట్టిగా నవ్వాడు లోశ్.

''ఈ గూసెవ్ గాడికి వయసు మీరిపోయి మతి మరుపు ఎక్కువైపోయింది. సీక్రెట్ కాన్ఫరెన్స్ అన్న విషయం మర్చిపోయి, దర్బారులో కూర్చొన్నట్లు ఫీలయి పోతున్నాడు, వెర్రిపీనుగ'' పరిహాసంగా అన్నాడు.

లోశ్ అభినయానికి ఫక్కుమన్నారందరూ. గూసేవ్ ఒరలోంచి పొడుగైన కత్తి సర్రునలాగి లోశ్ మీదకు ఎగిరి దూకాడు.

ఈ పరిణామానికి అందరూ నివ్వెరపోయారు. అందరి ముఖాల్లో చక్రవర్తిపట్ల అసహ్యం స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రక్కకి దూకాడు లోకేశ్. గూసెప్ చేతిలోని ఖడ్గం లోకేశ్ భుజాన్ని రాసుకొంటూ దూసుకెళ్ళింది. చిక్కని రక్తం బయటకు ఉరికింది. లోకేశ్ కళ్ళు నిప్పుకణాలైనాయ్.

గూసెప్ ఖడ్గాన్ని మరోసారి విసరబోతుండగా కోనిగీ వెనక నుంచి వాటేసుకొని ఖడ్గం లాగేసుకొన్నాడు.

"ఒరేయ్ గూసెప్! నీ రాక్షసత్వానికి నిరంకుశ పరిపాలనకు ఈనాటితో రోజులు తీరిపోయాయిరా. రేపు తెల్లవారే సరికల్లా మర్యాదగా రాజరికాన్ని రద్దుచేసుకొని ప్రభుత్వాన్ని మాకప్పగించు. లేదా ప్రజావిప్లవంతప్పదు. జాగ్రత్త!" గర్జిస్తూ బైటకెళ్ళి పోయాడు లోకేశ్. మిగిలిన వాళ్ళంతా అతనిని అనుసరించారు.

బోనులో పడ్డ పులిలా అటూ ఇటూ తిరుగుతూ లోకేశ్‌ను బండబూతులు తిడుతున్నాడు గూసెప్. కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయ్. ఆగ్రహంతో ఊగిపోతున్నాడు.

అటూ ఇటూ పచార్లు చేస్తున్న చక్రవర్తి ఒకమూలగా ఉన్న మెషిన్ దగ్గరకు నడిచాడు.

స్విచ్ నొక్కి 'అయిలీతా' అని గట్టిగా అర్చాడు. రెండు మూడు సార్లు పిలిచాక అవతలినుంచి అయిలీత సమాధానం విన్పించింది.

"అయిలీతా ఆకాశపుత్రులేం జేస్తున్నారు?"

"నిద్రపోతున్నారు!"

"సరే! నేను చెప్పిన పనేం జేస్తావ్?"

మాట్లాడలేదు అయిలీత.

"అయిలీతా! ఇన్నాళ్ళూ నీవు వాళ్ళద్వారా సైన్స్ నేర్చుకుంటూనంటే, వాయిదాలు వేస్తూంటే సహించాను. కాని ఇంక నాకు ఓపిక లేదు. రేపు తెల్లారేసరికల్లా ఆకాశ పుత్రుల శవాలు వాయునౌకలో నా దగ్గరకు చేరాలి. ఈ వెర్రిపీనుగ లోశ్ గాడు విప్లవం లేవదీస్తాడంట. నా సైన్యం అంతా ఆయుధాలతో పైన విరుచుకుపడితే ఎలా లేవ దీస్తాడో చూస్తాను" గర్జించాడు గూసెప్.

"ఏం అయిలీతా మాట్లాడవేం?"

"క్షమించండి నాన్నా! నేను ఆకాశపుత్రులను చంప లేను!" వణుకుతున్న కంఠంతో అంది అయిలీత.

"అయిలీతా?" అర్చాడు చక్రవర్తి.

"అవును నాన్నా! సైంటిస్ట్ పృథ్వీరాజ్, నేనూ ప్రేమించుకొన్నాం. మీ అనుమతి అయితే ఆయనతో కలిసి భూగ్రహానికి వెళ్ళిపోతాను."

"అసంభవం! బుద్ధిరిగే మాట్లాడుతున్నావా?" అరి చాడు.

"కాదు! సంభవమే!" ధృఢంగా అంది అయిలీత.

"ఎలా అవుతుందో నేనూ చూస్తాను. నీ కళ్ళముందే ఆ ఆకాశపుత్రు లిద్దర్నీ చిత్రవధ చేసి చంపుతాను," మెషిన్ ముందు నుంచి లేచి లోనికి మాయమయ్యాడు గూసెప్.

టెలివిజన్ స్విచ్ ఆఫ్ చేశాడు సురేష్.

కోనా ముఖంలోకి చూస్తూ, "వెంటనే వెళ్ళి అయి లీతను పిల్చుకురా!" అన్నాడు గంభీరంగా.

కోనా బైటకు పరిగెత్తింది.

వాచీ చూసుకొన్నాడు. అయిదయింది. 'మరో గంటలో గూసెవ్ సైనికులు ఈ భవనం చుట్టూ క్రమ్ముకోవచ్చు' అనుకొంటూ చకచకా వెళ్ళి పృథ్వీరాజ్‌ను లేపసాగాడు.

9

సురేష్ సిగార్ తీసి వెల్గించాడు. అయిలీత, కోనా అతని ముఖంలోకి ఆత్రంగా చూస్తున్నారు. పృథ్వీరాజ్ కళ్ళు మూసుకొని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"సురేష్‌జీ!" పిలిచింది అయిలీత.

"ఏమిటమ్మాయ్!" అడిగాడు.

"సైనికులు ఇక్కడికి చేరుకోటానికి ఎలాగూ అరగంట పైనే పడుతుంది. ఈలోగా మనమే ఇక్కడినుంచి వాయునౌకలో వెళ్ళిపోయి మీ అంతరిక్ష నౌక చేరుకొంటే?..."

"పారిపోదామంటావా అమ్మాయ్?" నవ్వాడు సురేష్.

"చూడమ్మాయ్ మీ నాన్నగారి సైనికులు ఇక్కడికి వచ్చేసరికి మనం లేకపోతే ఏమౌతుందో తెల్సా? వాళ్ళను మానం నేరుగా మా అంతరిక్ష నౌక మీదకు పోతుంది. సో అత్సేర నగరం అడ్డవటంవలన మనం చుట్టూ తిరిగి ఆలస్యంగా అక్కడికి చేరేలోగా, ఇక్కడికి వచ్చిన సైనికులు తిరిగి స్పేస్ రాకెట్ దగ్గరకు మనకంటే ముందే చేరుకొని మనకోసం ఎదురుచూస్తుంటారు."

"మరయితే ఏం చెయ్యటం? వెంటనే ఇక్కడినుంచి వెళ్ళిపోవటం అనేది తప్పనిసరిగా జరగవలసిన పని" అన్నది అయిలీత.

"చూడమ్మాయ్ అయిలీతా! అసలు మే మీ గ్రహంకి బయలుదేరినప్పుడు, ఈ గ్రహంలో జీవరాసి ఉంటే వారి

చేత మా దేశాన్ని గుర్తించినట్లు ఒప్పించి, తిరిగి వెళ్ళా లనుకొన్నాం.

కాని, పరిస్థితి ఇలా తిరగబడటంతో మనం గూసెవ్‌కు భయపడి పారిపోతే ఇక్కడ మాకోసం విప్లవానికి కూడా సిద్ధపడ్డ లోకకు మీ శుక్రగ్రహ ప్రజలకూ అన్యాయం చేసినట్లవుతుంది. పారిపోయినందుకు మా దేశానికూడా అవమానం కలిగినట్లవుతుంది. అందుకే మమ్మల్ని నమ్మి ఎదురుతిరిగిన ఇంజనీర్ లోకకు సహాయంగా నేను వెళ్తారు. మీరు అంతరిక్ష నౌక దగ్గరకు వెళ్ళిపోండి. అదృష్టం బాగుండి మనమే నెగ్గితే పారిపోవట మన్న ప్రసక్తే ఉండదు. ఒకవేళ యుద్దంలో ఓటమి కలిగి నాకేమయినా జరిగితే పృథ్వీరాజ్‌తో నీవు అంతరిక్ష నౌకలో మా దేశం వెళ్ళిపో. ఇక్కడికి సైనికులు రాకుండా నేను చూసుకుం టాను'' అన్నాడు సురేష్ గంభీరంగా.

''సురేష్‌జీ!'' ఆశ్చర్యంగా చూశాడు పృథ్వీరాజ్.

''అవునబ్బాయ్! పరిస్థితులుగాని ఎదురు తిరిగితే నా కోసం యుద్ధరంగంలో ప్రవేశించక'' అంటూ వాచీ చూసుకొని లేచి నిలబడి వేగంగా బైటకు కదిలాడు.

నిర్వేరపోయి చూస్తూండి పోయారు ముగ్గురూ. చక చకా ఆవరణలో ఉన్న వాయునౌకల దగ్గరకు నడిచి వాటి ప్రక్కనే నిద్రపోతున్న నౌక కుర్రవాణ్ణి లేపి, నౌకలు సిద్ధం చేయమన్నాడు.

ఐదు నిముషాల్లో రెండు నౌకలూ ఆకాశంలోకి లేచాయ్.

అంతరిక్ష నౌక వైపు దూసుకుపోతున్న నౌకలోని వాళ్ళకు చివరిసారిగా వీడ్కోలిచ్చి 'సో అత్సేగ' నగరం వైపు మళ్ళించాడు సురేష్ తన వాయునౌకను.

అతని జేబులో రివాల్వర్ బరువుగా ఉంది. వాయు నౌకలో అక్కడక్కడ ఆయుధాలు చెదురుమదురుగా పడి ఉన్నాయ్.

10

గంట అయిదున్న రాత్రోంది.

మేజర్ సురేష్ వాయునౌక 'స్రో అత్సేర' నగరంవైపు పరుగులు తీస్తుండగా అకస్మాత్తుగా ఓ అరడజను వాయు నౌకలు ఎదురయ్యాయి. సురేష్ రివాల్వర్ బయటకు లాగాడు. దానిలోని ఆరుగుళ్ళతో అన్ని నౌకలను నాశనం చేయటం సాధ్యం కాదని అతనికి తెలుసు.

ఎదురుగా వస్తోన్న వాయునౌకల్లోంచి శుక్రగ్రహ భటులు చేతులెత్తి ఉత్సాహంగా అరుస్తున్నారు.బహుశా ఎదురువస్తున్నది తమ వాళ్ళకు చెందిన నౌకే అనుకొం టున్నారు కాబోలనుకొన్నాడు సురేష్.

వేగాన్ని పెంచాడు. వాయునౌక ఎగురుగా వస్తోన్న నౌకలను రాచుకొంటూ ప్రక్కనుంచి దూసుకుపోయింది. నౌకల్లోని సైనికులు ఆశ్చర్యపోయారు. సాధారణంగా తమ గ్రహంలో ఏ రెండు వాయునౌకలు ఎదురైనా ఆగి పలకరించుకోవాలి. కాని ఇదేమిటి?

ఏదో అనుమానం పొడచూపింది వారిలో. మరు క్షణంలో వాయునౌకలన్నీ వెనుతిరిగి సురేష్ నౌక వెంట బడ్డాయ్. సైనికులకి అనుమానం వచ్చిందని అర్థమైందతనికి. అరక్షణంపాటు ఏమి చెయ్యాలో తోచలేదు. కనీసం మరొకడైనా ఉంటే వాడికి డ్రైవింగ్ అప్పగించి తాను యుద్ధం చేసేవాడు.

అకస్మాత్తుగా అతని దృష్టి ఇంజన్ బోర్డుకి అటూ ఇటూ గొట్టాలలాగ బిగించబడివున్న మెషిన్‌గన్స్ లాంటి

ఆయుధాలపై పడింది. తొందరవలనా, చీకటి వలనా వాటిని అంతవరకూ చూడలేదతను.

డ్రైవింగ్ సీట్లో కూర్చొని డ్రైవ్ చేస్తూ ఎదురు వచ్చిన శత్రువులను ఎటాక్ చేయటానికి ఎంతగానో ఉపయోగపడే విధానం అది.

వాటిని చూస్తూంటే సెకండ్ వరల్డ్ వార్ టైమ్‌లో జర్మన్స్ ఉపయోగించిన వార్ ప్లేన్స్ గుర్తొచ్చాయతనికి. అప్పటికింకా యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ గన్స్ ఇంప్రూవ్‌మెంటు కాకపోవటంవలన ఒక ప్లేన్‌ను స్మాష్ చెయ్యాలంటే మరో ప్లేన్ ద్వారానే సాధ్యమయ్యేది. అందుకే ప్లేన్ వార్స్‌లో పైలెట్‌కు అటూ ఇటూ బిగించబడిన మెషిన్‌గన్స్ ద్వారా ఫైరింగ్ జరిగేది.

సురేష్ మనసు ఆనందంతో గంతులేసింది. రివాల్వర్‌ను జేబులోకి తోసి ముందుకు వెళ్తున్న వాయునౌకను వెనక్కి త్రిప్పి వాయునౌక ముందున్న ఫ్లడ్ లైట్స్ ఆర్పేసి ఆకాశంలో ఇంకా ఎత్తుకు పోనిచ్చాడు.

చిన్నగా శబ్దం చేస్తూ నెమ్మదిగా ముందుకు సాగుతోంది వాయునౌక. అరనిముషం తర్వాత వెంటాడుతూ వస్తోన్న వాయునౌకలు క్రిందుగా కన్పించాయి. యాంగిల్ మార్చి నిలువుగా ఉన్న గన్స్ వాలుగా అమర్చాడు.

చిక్కని చీకటిలో వాయునౌకల ఫ్లడ్ లైట్స్ దేదీప్యమానంగా వెలుగుతూ కదులుతున్నాయ్. వ్యూలోకి వచ్చేదాకా ఆగి ఫైర్ చేశాడు. నిప్పురవ్వలు దూసుకెళ్ళి రెండు వాయునౌకలను తాకాయి. గట్టిగా శబ్దంచేస్తూ వాయునౌకలు అంటుకోగానే ఆ పరిసరాలంతా జాజ్వల్యమానంగా వెలుగుతున్న మంటలతో పట్టపగలుగా మారింది.

మిగిలిన నాలుగు నౌకలలోంచి ఫైరింగ్ మొదలైంది. తన వాహనాన్ని వేగం పెంచి చీకటిలోకి దూకించాడు సురేష్. ఆ గన్ బులెట్స్ ఎంత శక్తివంతమైనవో తెలియటం వలన జాగ్రత్తగా నడపసాగాడు.

చీకట్లో కలిసిపోయిన సురేష్ వాహనాన్ని వెదుకుతూ పరుగులు తీస్తున్నాయి వాయునౌకలు. కదులుతున్న ఫ్లడ్ లైట్లను చూస్తూ జాగ్రత్తగా నడుపుతున్నాడు నౌకను. రివాల్వర్ను తీసుకొని ట్రిగ్గర్పై వేళ్ళు బిగించాడు. దగ్గరలో కనిపిస్తున్న వాయునౌకవైపు త్రిప్పాడు రివాల్వర్ బారల్. ఈ వాయునౌకలవి రైట్ వీల్ డ్రైవింగ్ అవటం వలన వాయునౌక రెండు ఫ్లడ్ లైట్ల మధ్యా కొంచెం ఎడం వైపు చీకట్లో గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కాడు.

అద్దాన్ని ఛేదించుకొని బులెట్ దూసుకెళ్ళింది.

అరసెకను తర్వాత అద్దాలు బ్రద్దలైన శబ్దం, వెనువెంటనే శుక్రగ్రహవాసి వేసిన చావుకేక అస్పష్టంగా వినిపించాయి. ఒక్కక్షణం ఊగిసలాడిన ఆ వాయునౌక చిన్న పల్టీ కొట్టి అడ్డదిడ్డంగా ఎగిరివెళ్ళి ప్రక్కనే కదులుతున్న మరో వాయునౌకను ఢీకొంది. పెద్ద మెరుపు మెరిసింది. కళ్ళు చిట్లించాడు సురేష్. చెవులు గళ్ళక్కే శబ్దంతో ప్రేలాయ్ రెండు వాయునౌకలూ.

అకస్మాత్తుగా దూరంలో కదులుతున్న రెండు నౌకల ఫ్లడ్ లైట్లూ ఆరిపోయాయి.

సురేష్ గుండె జల్లుమంది.

జాగ్రత్తగా పోనిస్తున్నాడు నౌకను మధ్య మధ్య గన్స్ కాలుస్తూ. సమాధానంగా రెండునౌకలలోంచి కూడా నిప్పు రవ్వలు చీకట్లో పరుగు తీస్తున్నాయి.

పావుగంట సేపు జరిగింది చీకటియుద్ధం. ఏం చెయ్యాలో తోచట్లేదు. పోనీ కాల్చుదామా అంటే చీకట్లో ఎవరెక్కడున్నారో అర్థం కావటం లేదు.

ఆలోచిస్తున్నాడు సురేష్.

చిన్న ఐడియా తట్టింది.

చేతిలోని రివాల్వర్ వైపోసారి ఆప్యాయంగా చూసుకొని గన్స్ బటన్స్ నొక్కాడు.

మెరిగింది గన్. నిప్పురవ్వలు చీకట్లో ప్రయాణించాయ్. మరుక్షణం కుడివైపు నుంచి ఫైరింగ్ ప్రారంభమైంది. ఆ క్షణంలోనే ట్రిగ్గర్ నొక్కాడు రివాల్వర్ను ఆ వైపు త్రిప్పి.

శుక్రగ్రహవాసుల ఫైరింగ్ నుంచి సురేష్ తప్పించుకొన్నాడు గాని అతని రివాల్వర్ బులెట్ బారినుంచి సైనికుల వాయునౌకలు తప్పించుకోలేకపోయినవి.

11

'స్పో అత్సేర' నగరంలో పెద్ద పెద్ద ప్రేలుళ్ళు వినిపిస్తున్నాయ్. ఇంజనీర్ లోశ్ ఉత్సాహంగా గన్ ప్రేలుస్తున్నాడు.

ఆకాశం అంతా వాయునౌకలు నిండిపోయాయి. విచ్చలవిడిగా పరుగులు తీస్తూ క్రింద కన్పించిన ప్రతీ శుక్రగ్రహ వాసినీ కాల్చేస్తున్నాయ్. వేలకొలదీ శుక్రగ్రహ వాసుల శవాలు రోడ్లపై దొర్లుతోంటే క్రిందనుంచి లోశ్ అనుచరుల కాల్పులకు అప్పుడప్పుడూ వాయునౌకలు నేలకూలుతున్నాయ్.

గన్ నిండుగా అమ్యూనిషన్ నింపి తిరిగి కాల్పులు ప్రారంభించాడు ఇంజనీర్ లోశ్. ఉల్కల్లా మరో రెండు

నౌకలు రాలిపడ్డాయి. వాటితో మొత్తం తను కూల్చిన వాయునౌకల సంఖ్య ఎనిమిది.

అతనున్న వైపున ఆకాశంలోంచి గుండ్లవర్షం ప్రారంభ మైంది. ఎదురుగా ఉన్న బిల్డింగ్ లోకి పరుగుతీశాడు.

రోడ్లపై గుట్టలుగా పడివున్న శవాలను చూస్తోంటే అతని కళ్ళలో నీళ్లు తిరుగుతున్నాయి. నిస్సహాయులైన శుక్రగ్రహవాసుల విప్లవాన్ని సాయుధబలంతో అణి చెయ్యటానికి పూనుకొన్న 'గూసెవ్'ను తల్చుకుంటోంటే అతనిలో ఆవేశం పరవళ్ళు త్రొక్కుతోంది.

ఒకప్రక్క ఆలోచించకుండా విప్లవం లేవదీసి ఇంత మంది చావుకి గురయ్యానా అనే బాధ సల్పుతోంది.

చేతిలో ఆయుధం లేకుండా ఉన్న పాతికమంది అను చరులతో వేలకొలదీ సైనికులను ఎలా నాశనం చెయ్యాలో అర్థంకావటంలేదు. మొత్తం ఇప్పటివరకూ తామందరూ కూల్చేసిన వాయునౌకలు మహా ఉంటే వంద ఉంటాయి.

పోతే శత్రువులు కాల్చిన కాల్పులకు తన అనుచరు లలో ఎంతమంది గురయ్యారో తెలియదు.

అటువంటి వాతావరణంలో కూడా లోశ్ ఉత్సా హంగా శత్రువులను ఎదుర్కొంటున్నాడు. అంతకు కొంచెం క్రితమే ఆకాశపుత్రులు ఒక అరడజను శత్రు నౌకలను కూల్చేసి తమకు సహాయంచేయటానికి సోఅత్సేర నగరంవైపు వస్తున్నట్లు ఓ నౌకలోంచి ప్రసార మాతోం డగా విన్నాడు తను. ఆ సందర్భంలోనే ఆకాశపుత్రులను ఎదుర్కోడానికి వెళ్తోన్న వాయునౌకలలో రెండింటిని కూల్చేశాడు కూడా.

గట్టిగా శబ్దం విన్పించి ఆలోచనలనుంచి తేరుకొంటూ తలెత్తి చూశాడు. శత్రునౌక ఒకటి తనున్న భవనంపై నుంచి దూసుకెళ్తోంది. అప్రయత్నంగా గన్ కాల్చాడు. బులెట్ వెళ్ళి రేలింగ్ కు ఆనుకొని నిలబడ్డ ఒక సైనికుడి గుండెల్లో దూరింది. చావుకేక పెట్టి క్రిందకు కూలి పోయాడు వాడు. లోశ్ ఉన్నవైపు రెండుసార్లు కాల్పులు సాగించి దూరంగా ఎగిరిపోయింది నౌక.

లోశ్ ఒక్కంగలో బయటికి ఉరికి సైనికుడు పడి ఉన్న చోటుకి పరిగెత్తాడు. వాడి చేతిలోని మెషిన్ గన్ను లాక్కోగానే వెయ్యేనుగుల బలం వచ్చినట్లు ఫీలింగ్ కలిగింది.

అంతలో అటువైపు దూసుకొచ్చిన మరో వాయునౌక ఫ్లడ్ లైట్ల కాంతి అతనిపై పడింది.

మరుక్షణం మెషిన్ గన్ కాల్పులు.

లోశ్ జర్రున ప్రక్కకి జారాడు.

కొంచెం దూరంలో ఉన్న లోశ్ అనుచరుడు వెంటనే నౌకవైపు కాల్పులు సాగించాడు.

రెండు నిప్పు గోళాలు లోశ్ ఎడమభుజంలో దిగాయి. కళ్ళు బైర్లు క్రమ్మాయ్ లోశ్ కు.

తూలుతూ లేచి బిల్డింగ్ లోకి పరుగుతీశాడు. లోశ్ అనుచరుడు కాల్చిన బులెట్ తగిలి వాయునౌక అడుగు నుంచి చిన్నగా పొగవస్తూ కన్పించింది. లోశ్ పెదవులపై చిరునవ్వు కదులాడి మాయమయ్యేలోగానే పెట్రోల్ టాంక్ ప్రేలింది.

ఎడమచెయ్యి విపరీతంగా సలుపుతోన్నా లెక్కచెయ్యకుండా మెషిన్ గన్ తో ఫైరింగ్ మొదలెట్టాడు లోశ్. అయిదు నిముషాల్లో ఇరవైపైగా వాయువిమానాలను కూల్చేశాడు.

ఒకేసారి అన్ని నాశనమయ్యేసరికి వాయునౌకలలో సంచలనం ఏర్పడింది. పిచ్చెక్కినట్లు కాల్పులు మొదలయ్యాయి.

అనుమానం కలిగిన చోటల్లా బాంబులు వేసి నాశనం చెయ్యటం మొదలెట్టారు సైనికులు.

రెండునిముషాలు గడిచాయి. కళ్ళు మూసుకొని భారంగా ఊపిరిపీలుస్తున్నాడు లోశ్. అతని అనురులందరూ అమ్యూనిషన్ అయిపోవటంతో ఏం చెయ్యాలో దిక్కుతోచక ఆకాశంలోకి చూస్తున్నారు.

వాయునౌకల విజృంభణ క్షణక్షణానికీ ఎక్కువౌతోంది. ఎక్కడ బడితే అక్కడ బాంబులవర్షం కురుస్తోంది. భవనాలు పేలిపోతున్నాయ్. శుక్రగ్రహవాసులు భయంతో వణికిపోతున్నారు.

12

ప్రళయంలా దద్దరిల్లుతోన్న సౌఅత్సేర నగరంవైపు పరిశీలనగా చూశాడు సురేష్. కాబిన్‌లో చెల్లాచెదురుగా పడి ఉన్న మెషిన్‌గన్‌లు ఓ అరడజను భుజానికి తగిలించుకొన్నాడు. పెట్టెనిండుగా ఉన్న అమ్యూనిషన్ కొన్ని బాంబులను వేసి జేబులు నింపుకొన్నాడు. ఏ క్షణానైనా దూకెయ్యటానికి వీలుగా సాధ్యమైనంత వరకూ ఎత్తును తగ్గించి వాయునౌకను వేగంగా పోనిచ్చాడు.

కొంచెందూరం పోయేసరికి ఎదురుగా షార్క్ చేపల మందలా దూసుకొని వస్తోన్న శత్రునౌకలు కన్పించాయ్. ఫ్లడ్‌లైట్స్ ఆఫ్ చేసి మాగ్జిమమ్ స్పీడుకు ఫిట్ చేసి వేళ్ళతో గన్స్‌బటన్స్ నొక్కి ఉంచాడు.

ఫైరింగ్ మొదలైంది. అవతలివాళ్ళు సర్దుకొనేలోగా నాలుగు వాయునౌకలు కూలిపోయాయి, వాటిప్రక్క

మంచి దూసుకుపోతున్న సమయంలో రెండుబాంబుల క్లిప్స్ ఊడబీకి విండోలోంచి బైటకు విసిరాడు.

పెద్ద విస్ఫోటం జరిగింది, తల త్రిప్పి చూశాడు. బాంబుల ధాటికి ప్రేలిన నౌకల్లోంచి ఫైర్‌బాల్స్ ప్రక్కనే కదులుతోన్న వాటిపై పడటంతో చాలావరకూ వాయు నౌకలు నాశనమయ్యాయి. మిగిలిన నౌకలు వెంటబడటం గమనించాడు సురేష్.

వాయునౌక అతివేగంగా 'సోఅత్సేర' నగరంలో ప్రవేశించింది. మరికొన్ని శత్రునౌకలు ఎదురవస్తుండటం చూడగానే వేగం తగ్గించి బాగా క్రిందకి పోనిచ్చాడు. నేలకి తక్కువ ఎత్తులోకి రాగానే యాక్సిలేటర్ పూర్తిగా వేసి బయటకు దూకేశాడు.

రివ్వున పైకి లేచిన వాయునౌక ఎదురుగా వస్తోన్న శుక్రగ్రహ నౌకలవైపు దూసుకెళ్ళింది. మీదకు వస్తోన్న వాయునౌకను చూసి తమ వాటిని ప్రక్కకి తప్పించబోయారు సైనికులు.

అంతలోనే సురేష్ ప్రయాణం చేసిన నౌక ఫెడీ... ఫెడీమంటూ గుద్దేస్తూ వాయునౌకల గుంపులోకి దూరిపోయి ప్రేలిపోయింది. ఏం జరిగిందో తెలుసుకొనేలోపలే మిగిలిన నౌకలుకూడా దానిని అనుసరించాయి.

క్రిందకి దూకిన సురేష్ ముందుకి పరుగుతీసి కొంచెం దూరంలో ఉన్న భవనంలోకి ఎగిరిదూకాడు. ప్రాణ భయంలో ఒణికిపోతోన్న శుక్రగ్రహ ప్రజలు పిడుగులా దూసుకొచ్చిన సురేష్ వైపు క్షణకాలం తెల్లబోయిచూసి, మరుక్షణం ఆనందంతో 'ఆకాశపుత్రా' అంటూ గంతు లెయ్యడం మొదలెట్టారు.

"ఇంజనీర్ లోకేశ్ ఎక్కడ?" విసుగ్గా అరిచాడు శుక్ర గ్రహ భాషలో. బయట నిలబడివున్న కొద్ది అమ్యూనిషన్‌తో కాల్పులు జరుపుతున్న లోకేశ్ అనుచరుడొకడు లోనికి పరిగెత్తుకొచ్చాడు.

"ఎవరు నువ్వు? లోకేశ్ అనుచరుడవా?" అడిగాడు సురేష్. "అవును ఆకాశపుత్రా!" చేతులు కట్టుకొని సంతోషంగా సమాధానం ఇచ్చాడు వాడు.

మెషిన్‌గన్ తీసి వాడివైపు విసిరి లోకేశ్ ఎక్కడని అడిగాడు సురేష్.

మెషిన్‌గన్ అందుకొని బైటకు పరిగెత్తాడు అతను. సురేష్ అనుసరించాడు. దూరంగా ఒక భవనంలోంచి మెషిన్‌గన్ ప్రేలుడు విన్పించింది. చెయ్యెత్తి అటు చూపించాడు అతను.

"సరే! నువ్వు నా వెంట రా!" అంటూ ఆ భవనం లోంచి ఒకడిని పిలిచి తన దగ్గరున్న గన్స్ వాడికిచ్చి ఆ చుట్టుప్రక్కలున్న లోకేశ్ అనుచరులకు అందించమని బైటకు పరిగెత్తాడు. లోకేశ్ అనుచరుడు అతని వెనుకే మెషిన్‌గన్ ప్రేలుస్తూ అనుసరించాడు.

సురేష్ ఇంజనీర్ లోకేశ్ దగ్గరకు చేరేసరికల్లా అతనిచ్చిన గన్స్ అన్నీ లోకేశ్ అనుచరులకు అందాయని తెలుపుతూ నాలుగైదు చోట్లనుంచి ఫైరింగ్ మొదలైంది.

తనదగ్గరకు పరిగెత్తుకొచ్చిన సురేష్‌ని చూడగానే లోకేశ్ కళ్ళలో కృతజ్ఞతతో కూడిన మెరుపు కదిలింది. "ఆకాశపుత్రా!" అన్నాడు గాద్గదికంగా.

సురేష్ సానుభూతిగా అతని భుజం తట్టాడు. చెట్ల

మీద పిట్టల్లా రాలిపడుతున్నాయి వాయునౌకలు. వాచీ చూసుకొన్నాడు సురేష్.

గంట ఎనిమిది అయింది. మరో రెండు గంటల్లో తెల్లారుతుంది. ఈలోగా ప్రభుత్వాన్ని వశపరుచుకోలేక పోతే ఇక తమ తరం కాదు. వెలుగురేఖలు శుక్రతలంపై పడిన మరుక్షణం నిముషాల్లో విప్లవకారుల్ని పట్టుకొని చంపేస్తారు సైనికులు.

నిర్విరామంగా కాలుస్తున్నారు లోశ్ అనుచరులు. ఎన్ని వాయునౌకల్ని కూల్చినా అంతకు రెట్టింపు నౌకలు యుద్ధంలోకి దూకుతున్నాయి.

గట్టిగా తల విదిల్చాడు సురేష్.

"మిస్టర్ లోశ్. మనం ఇలాగ పోరాడితే లాభం లేదు. ఎన్ని నౌకల్ని నాశనం చేసినా ఇంకా పుట్టుకొస్తున్నాయి. అదీకాక మనదగ్గరున్న అమ్యూనిషన్ కొంచమే. అదయిపోయాక ఎలా ఎదుర్కొనేది?" అడిగాడు.

"ఏం చేద్దామంటారు?"

"ఏం చెయ్యాలన్నా విజయం రావాలంటే చేయవలసింది ఒక్కటే! ఎలాగయినా రాజభవనంలో ప్రవేశించి గూసెవ్‌ను చంపెయ్యటం. గూసెవ్ చనిపోయిన మరుక్షణంలో నూతన చక్రవర్తిగా మీ ఆజ్ఞను అనుసరించి సైనికులు వెనక్కి మరులుతారు" చెప్పాడు సురేష్.

"కాని రాజభవనంలోకి ప్రవేశించటం కష్టం. చుట్టూ చాలా బందోబస్తుంటుంది!" నెమ్మదిగా అన్నాడు లోశ్.

"కాని తప్పదు! ఇక్కడి కెంతదూరం వుంటుంది రాజమందిరం?" అడిగాడు.

"దగ్గరే! నాలుగు ఫర్లాంగులుండొచ్చు!"

"అయితే ఆలస్యం ఎందుకు వెంటనే వెళ్తాను."

"నేనూ వస్తాను పదండి!" లేచాడు లోకేశ్.

"వద్దు! మీ పరిస్థితేమీ బాగుండలేదు."

బలహీనంగా నవ్వేడు లోకేశ్.

"ఫర్వాలేదు. నాయకుడిగా నాకా బాధ్యత తప్పదు."

"సరే మీ ఇష్టం" బయటికి వెళ్ళి భవనాలచాటు నుంచి నడిచాడు. అనుసరించారు లోకేశ్, అతని అనుచరుడూ.

పావుగంట గడిచింది. నెమ్మదిగా నడుస్తూ చక్రవర్తి భవనాల సమీపానికి చేరుకొన్నారు, అన్ని భవనాలలో దీపాలు వెలుగుతున్నాయి. సాయుధ సైనికులు అన్నీ భవనాలపైన చీమల్లా కన్పిస్తున్నారు.

వారిని చూడగానే నీరసంగా నిట్టూర్చాడు ఇంజనీర్ లోకేశ్. "అంత బలమైన కాపలా వుండగా గూసెవ్‌ను చంపటం ఆ దేవుడితరంకూడా కాదు" గొణిగాడు.

సురేష్ జేబునిండుగా ఉన్న బాంబులు తీసి లోకేశ్‌కు కొన్ని అతని అనుచరుడికి కొన్ని ఇచ్చాడు.

"ఆకాశపుత్రా! ఏమిటి మీ ఆలోచన అంతమంది వుండగా గూసెవ్‌ను చంపటం ఎలా?" గట్టిగా అడిగాడు లోకేశ్ సురేష్ వైపు అయోమయంగా చూస్తూ.

"లోకేశ్! ఆ చీకటిగా కనబడే భవనం ఎవరిది?" లోకేశ్ ప్రశ్నకు జవాబు చెప్పకుండా చక్రవర్తి భవనాలకు కొంచెం ప్రక్కనే ఉన్న ఖాళీ భవనంవైపు చూపిస్తూ అన్నాడు సురేష్.

"చక్రవర్తిదే! అప్పుడప్పుడు రహస్యమైన విషయాలను గురించి చర్చించటానికి, సమావేశాలు జరపటానికి ఉపయోగిస్తుంటాడు" సురేష్ వైపు చూస్తూ చెప్పాడు.

"గుడ్. మనకీ భవనం బాగా ఉపయోగిస్తుంది. దీనిపై నుంచి తేలికగా ఎటాక్ చెయ్యవచ్చు" ఉత్సాహంగా అన్నాడు. ఐదునిముషాల తర్వాత అతి కష్టంమీద ఆ భవనంలో ప్రవేశించగలిగారు.

గన్‌తో తాళం బద్దలుగొట్టి లోనికి పరిగెత్తి మెట్ల మీదుగా పైకి చేరుకొన్నారు. టెర్రస్‌పై నుంచి చకవర్తి భవనాలపై సైనికులు స్పష్టంగా కన్పిస్తున్నారు. సురేష్ లోశ్ అనుచరుడివైపు తిరిగాడు.

"నువ్వు టెర్రస్ అవతలివైపు కెళ్ళి అటు ప్రక్క వాళ్ళను ఎటాక్ చేస్తూ వాళ్ళదృష్టిని నీమీద కేంద్రీకరించుకో!" చెప్పాడు. అతను తల ఊపి వెళ్ళిపోయాడు.

"ఆ సైనికులందరి దృష్టి అతనిమీద కేంద్రీకృతం కాగానే మనం ఇక్కడినుంచి దాడిచెయ్యొచ్చు. పరిస్థితి మనకు అనుకూలంగా మారుతుంది" మెషిన్‌గన్ బారల్ ఒక శుక్రగ్రహ సైనికుడికి గురిపెడుతూ అన్నాడు.

క్షణాలు గడుస్తున్నాయ్. నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ గన్ పేలింది. ఒక భవనంపై పహారా కాస్తూ తిరుగుతున్న సైనికుల్లో ఒకడు నేలకూలాడు. మరుక్షణంలో ఆ ప్రదేశమంతా కురుక్షేత్రంగా మారింది. లోశ్ అనుచరుడు బాంబు విసిరాడు. భయంకరమైన విస్ఫోటం ఉద్భవించి ఆ భవనం పైభాగం నామరూపాలు లేకుండా నాశనమయ్యింది.

మిగిలిన భవనాలపై ఉన్న సైనికులలో కలవరం ఎక్కువైపోయింది. లోశ్ అనుచరుడున్నవైపు నిప్పురవ్వలు తుఫానులా పయనిస్తున్నాయి. లోశ్‌కు సైగ జేసి ఫైరింగ్ మొదలెట్టాడు సురేష్. రెండుబాంబులు తీసి క్లిప్‌లు ఊడపీకి మరో రెండు బిల్డింగ్‌లపైకి శక్తికొలదీ విసిరాడు.

అరనిముషంపాటు శబ్దం భరించలేక చెవులు మూసుకో వలసి వచ్చింది ఇద్దర్నూ. ఖండాలైన శుక్రగ్రహ సైనికుల శవాలు గాలిలోకి ఎగిరాయి. చక్రవర్తి భవనాలపై ప్రేలుళ్ళు చూసి వందలకొద్ది వాయునౌకలు ఎగుర్తూ రాసాగాయి.

జేబులోంచి బాంబు అందుకొని క్లిప్ లాగబోతూ లోశ్ అనుచరుడు వేసిన చావుకేక విని ఆగిపోయాడు. కంగారులో ప్రమాదాన్ని గ్రహించక లేచి నిలబడి అటు వైపు తిరిగాడు లోశ్.

సురేష్ మెరుపులా చెయ్యందుకొని క్రిందకి లాగాడు. కాని ఆలశ్యమయ్యింది.

భగభగా మండుతున్న మంటల వెలుతురులో లోశ్ ఆకార్హాన్ని స్పష్టంగా చూడగలిగిన సైనికుల చేతిలోని గన్స్ మొరిగి లోనుంచి వెలువడ్డ బులెట్స్ లోశ్ హృదయాన్ని చీల్చేశాయ్.

కేక వేసే ఓపికకూడా లేక చిన్నగా మూలిగాడు లోశ్. అతని శరీరం సురేష్ పైకి వాలిపోయింది. అతని చేతులు కృతజ్ఞతగా సురేష్ చేతులపై బిగుసుకొన్నాయ్.

మేజర్ సురేష్ కళ్ళలో నీళ్ళు తిరిగాయ్. తనపైనున్న లోశ్ శవాన్ని ప్రక్కకు నెట్టి నెపోలియన్ లా చేతిలోని రెండు బాంబులూ ప్రక్కనే వున్న చక్రవర్తి భవనంపైకి విసిరి మెట్లవైపు పరుగుతీశాడు.

చక్రవర్తి భవనంలో ప్రేలుతున్న ప్రేలుళ్ళకి సురేష్ వున్న భవనం దద్దరిల్లిపోతోంది. మెట్లపై పరుగుతీస్తూ క్రిందకి దిగుతున్న సురేష్ కి మరో నాలుగైదు మెట్లున్నాయనగా కాలు జారింది.

తర్వాతేమయిందీ అతనికి తెలీదు.

13

సైంటిస్ట్ పృథ్వీరాజ్ నౌకను నడుపుతోన్న కోనా వైపు ప్రశ్నార్థకంగా చూశాడు. సోఅత్సేర నగరమంతా యుద్ధజ్వాలలతో మండుతూ కన్పిస్తోంది. వాయునౌకలు ఆకాశంలో పక్షుల్లా వున్నాయి.

సురేష్, సోఅత్సేర నగరంవైపు వెళ్ళిపోయాక అయిలీత తమ వాయునౌకను అంతరిక్షనౌక వైపు ప్రయాణం సాగించింది. అంతరిక్షనౌక చేరుకోగానే అయిలీతను, నౌకలో విడిచి, ఆమె బ్రతిమలాడుతున్నా వినకుండా తిరిగి వెనక్కి బయలుదేరాడు పృథ్వీరాజ్, కోనాను సహాయంగా తీసుకొని.

తీరా సోఅత్సేర నగరం చేరేసరికి వాతావరణం చాలా ప్రమాదకరంగా మారింది. నగరంలోనికి ఎలా ప్రవేశించాలో సురేష్‌ని ఎలా కలుసుకోవాలో అర్థంకాలేదు పృథ్వీరాజ్ కి.

"లాభంలేదు కోనా! ఈ పరిస్థితులలో నగరంలోనికి ప్రవేశించటం అసంభవం. ఏమాత్రం అనుమానం కలిగినా కాల్చేస్తారు సైనికులు. ఒకవేళ ప్రాణాలకు తెగించి ప్రవేశించినా, సురేష్ బ్రతికున్నాడో, లేదో తెలియదు" నిస్పృహగా అన్నాడు.

"అధైర్యపడకు ఆకాశపుత్రా! క్షేమంగా రాజభవనం దగ్గరకు చేర్చే దారి నాకు తెల్సు, మిమ్మల్ని చేర్చే పూచీ నాది!" అంటూ నౌకను ప్రక్కకి మరల్చింది కోనా.

"కోనా!" ఆశ్చర్యంగా చూశాడు.

"అవును ఆకాశపుత్రా! చక్రవర్తి గూసెప్ ప్రమాదకరమైన సమయాలలో తప్పించుకుపోయేందుకు వీలుగా

తన రాజభవనాలలో ఒక దానినుంచి సో అత్సేర నగరం బైటకు రహస్యంగా సొరంగాన్ని త్రవ్వించాడు. ఒక సందర్భంలో అయిలీతతో కలిసి దానిని నేను చూడటం తటస్థించింది. అదెక్కడుందో నాకింకా గుర్తే!" అంటూ వేగంగా నౌకను పోనిచ్చింది.

టైమ్ చూసాడు పృథ్వీ. పావుతక్కువ ఎనిమిది. ఆలోచిస్తూ కూర్చొన్నాడు.

అయిదునిముషాల తర్వాత వాయునౌక క్రిందికి దిగి ఒక చోట ఆగింది. కోనా క్రిందకి దూకి ముందుకి పరిగెత్తింది. ఆమెను అనుసరించి వెళ్ళి సొరంగంలో ప్రవేశించాడు.

సొరంగం చీకటిగా వుంది. టార్చి వేసాడు పృథ్వీరాజ్. నిశ్శబ్దంగా నడుస్తున్నారు. ఎంతనడిచినా సొరంగం తరగటం లేదు. నగరంలో ప్రేలుళ్ళు అస్పష్టంగా విన్పిస్తున్నాయి.

సరిగ్గా ముప్పావుగంట తర్వాత సొరంగం అంతమయ్యి చీకటిగా వున్న భవనంలోకి అడుగుపెట్టారిద్దరూ. టార్చి ఆర్పేశాడు పృథ్వీరాజు. నెమ్మదిగా నడుస్తూ ఒక్కొక్క గదినీ దాటి విశాలమైన హాలులోనికి వచ్చారు.

అకస్మాత్తుగా ప్రక్క నెక్కడో బాంబు పడిన శబ్దం విన్పించింది. రెండు సెకన్లపాటు గదిగోడలు దద్దరిల్లి పోయాయి.

మరుక్షణం ఎవరో మెట్లమీదుగా పరుగులు తీస్తున్న శబ్దం, ఆ వెనువెంటనే కాలుజారి క్రిందపడి దొర్లిన శబ్దం, విన్పించాయి.

మెట్లవైపు టార్చి వేశాడు పృథ్వీరాజ్.

మేజర్ సురేష్ తక్కున లేచి కూర్చోబోయాడు.

"సురేష్‌జీ! దెబ్బలేమీ తగల్లేదుకదా?" పృథ్వీరాజ్ కంఠం ఆత్రంగా, ఆశ్చర్యంగా విన్పించింది.

"పృథ్వీ...?"

"అవును నేనే!" సురేష్ భుజం పట్టుకొని పైకి లేపుతూ అన్నాడు సంతోషంతో.

"లోశ్ చచ్చిపోయా డబ్బాయ్!" సురేష్ కంఠం విచారంగా పలికింది.

ఏదో అనబోయాడు పృథ్వీరాజ్. అంతలో ఆ భవనం వైపు చాలామంది సైనికులు పరుగెత్తుకొస్తున్నట్లు శబ్దాలు విన్పించాయి.

"కమాన్ సురేష్‌జీ! నడవగలరుకదా?" కంగారుగా అడిగేడు పృథ్వీరాజ్.

"మహారాజులా" నవ్వేడు సురేష్.

సొరంగం వైపు పరుగెత్తారు ముగ్గురూ. తలుపులు బ్రద్దలుకొడుతున్న శబ్దం విన్పిస్తోంది! సొరంగం చివరకు రాగానే బాంబువిసిరి సొరంగాన్ని కూల్చివేశాడు సురేష్.

ఇరవై నిముషాల్లో ముగ్గురూ వాయునౌకలో అంతరిక్ష నౌకను చేరుకున్నారు. అప్పటిదాకా వారికోసమే ఎదురు చూస్తూ ఒంటరిగా కూర్చున్న అయిలీత కళ్ళు మిలమిల మెరిసాయి.

తెల్లవారుతుండగా అంతరిక్షనౌక గగనంలోకి లేచి, భూగ్రహంవైపు ప్రయాణం సాగించింది.

—: ఐపోయింది :—